
# జ్ఞాన మాల

శ్రీమతి తటవర్తి రాజ్యలక్ష్మి



బ్రహ్మర్షి పత్రీజీ ఆశీస్సులతో....

# జ్ఞాన మాల



రచన : తటవర్తి రాజ్యలక్ష్మి

ప్రథమ ముద్రణ : జూన్, 2024

కాపీలు : 1,000

వెల : రూ. 70/-

పుస్తకముల కొరకు

**తటవర్తి వీర రాఘవరావు**

తటవర్తివారి వీధి, భీమవరం-1. ప॥గో॥జిల్లా. ఆం.ప్ర.

సెల్ : 9440309812

email : balajipyramid.bvrm@gmail.com

# విషయ సూచిక


1) జ్ఞాన మాల ........................................ 3

2) సామాన్య జ్ఞానం, విశేషజ్ఞానం ........................ 4

3) పరాజ్ఞానము ........................................ 12

4) అజ్ఞానుల గురించి వశిష్ఠుల వారు ఏం చెప్పారు? .......... 16

5) కర్మలు ఎలా దగ్ధం చేసుకోవాలి? .......................... 25

6) అహంకారాన్ని, మమకారాన్ని ఎలా పోగొట్టుకోవాలి ......... 34

7) సాధకుని యొక్క అవలక్షణాలు .............................. 40

8) త్రికరణ శుద్ధి ఉండాలి అంటే? ............................ 47

9) మాట ఎలా ఉండాలి? ...................................... 50

10) ఆశ ....................................................... 53

11) సోమరితనం ................................................ 56

12) ఏది సరి అయిన సాధన? .................................... 60

13) ఆనంద స్థితిలో ఉండాలంటే? ................................ 64

# జ్ఞాన మాల

శంకరాచార్యులు వారు సాధనలో ఎదగాలంటే? నాలుగు విషయాలు బోధించారు. అవే 1. శ్రవణం, 2. మననం, 3.నిధిధ్యాసన, 4. సాక్షాత్కారం.

శంకరాచార్యులవారు మొట్టమొదట శ్రవణం అన్నారు. అంటే ఏ సందేశమైనా ముందు వినాలి. వింటూ చెప్పింది వ్రాసుకోవాలి. ఎప్పుడైతే వ్రాసుకుంటామో! మళ్ళీ, మళ్ళీ మననం చేసుకునే అవకాశం వస్తుంది. అంటే మళ్ళీ చదువుకోగలుగుతాం. వ్రాసుకోకపోతే ఏమీ ఉపయోగం వుండదు. ఎందుకంటే వింటున్నప్పుడు విన్నట్టుగానే ఉంటుంది, కానీ ఏమీ గుర్తుండదు. అందువల్ల తప్పనిసరిగా వ్రాసుకోవాలి.

ఆధ్యాత్మిక విద్య అంటే ఆత్మవిద్య అభ్యసించే వారికి తప్పనిసరిగా ఒక పెన్ను, పుస్తకం ఉండాలి. ఆ రెండు లేకుండా ఏ క్లాస్ కి వెళ్లినా దండగే! వృధా అయిపోతుంది. అటువంటి వారు ఈ మార్గంలోకి వచ్చినా కూడా రానట్టే లెక్క, విన్నా కూడా విననట్టే లెక్క.

అందుచేత వ్రాసుకున్నవారు మననం చేసుకుంటారు. మననం చేసుకోవడం వల్ల అర్థం చేసుకోగలుగుతారు. అర్థం చేసుకున్నది నిధిధ్యాసన అంటే ఆచరించగలుగుతారు. ఆచరించినవారు ఏ లాభంకోసం ఈ సాధన చేశారో ఆ ఫలితం వారికి సాక్షాత్కరిస్తుంది. అంటే ఆ లాభం వారు పొందుతారు.

అలా ప్రతి విషయం కూడా శంకరాచార్యులవారు చెప్పినట్టు శ్రద్ధగా చేస్తూ వుంటే? మీలో ఎంతో మార్పు వస్తుంది. మీ ప్రవర్తన మారిపోతుంది, పనులు మారిపోతాయి, మీ సాధనా స్థితి పెరుగుతుంది, మీ ఆలోచనా విధానం మారిపోతుంది, చివరికి మీ జీవితమే మారిపోతుంది.

అందుచేత గొప్పవాళ్లు ఏదీ ఊరికే చెప్పరు అని తెలుసుకోవాలి. అందరికీ లాభించేవి, ఉపయోగపడేవి, మంచి మార్పు తీసుకొచ్చే విషయాలే చెప్తారు. మరి శంకరాచార్యులవారు చెప్పినవి సామాన్య విషయాలా? అందుచేత తెలుసుకునే ప్రతీ విషయంలో ఆయన చెప్పినట్టు చేస్తే జీవితంలో మంచి లాభాలు పొందగలుగుతారు.

# సామాన్య జ్ఞానం, విశేషజ్ఞానం

ఎన్ని విషయాలు తెలుసుకున్నా, జ్ఞానం ఇంకా తెలుసుకోవల్సింది వుంటూనే ఉంటుంది. మొదట్లో అంటే చదువులు ప్రారంభించే ముందు, ఎల్కేజీలో కొద్దిగా తెలుసుకుంటాము. తరువాత హైస్కూల్‌లో కానీ, కాలేజీలో కానీ, యూనివర్సిటీలో కానీ ఇంకా ఇంకా వివరంగా తెలుసుకుంటాం.

ఇప్పుడు మనందరం కూడా రోజూ ఈ జ్ఞానం వింటున్నాము. అలా కొత్త విషయాలు తెలుసుకుంటూనే ఉన్నాము. మనం ఆధ్యాత్మిక జీవితంలోకి వచ్చాక, రెండు పదాలు ఎక్కువగా వినిపిస్తుంటాయి. అవి ఒకటి సాధన, ఇంకొకటి జ్ఞానం. ఆధ్యాత్మికత అంతా వీటి చుట్టూ తిరుగుతూనే ఉంటుంది. మనం పరలోక జ్ఞానం ఈ భూమి మీద ఉండగానే తెలుసుకోవలసి ఉంటుంది.

ఈ జ్ఞానం అనంతమైనది. ఏదైనా వస్తువుని "యదార్ధ స్థితిలో" తెలుసుకోగలగడమే జ్ఞానం. దేని గురించి అయినా దాని యదార్ధ స్థితిని నువ్వు తెలుసుకోగలిగితే దాని గురించిన జ్ఞానం నీకు వచ్చినట్లే! అలా యదార్ధ స్థితిని తెలుసుకోగలిగే శక్తి, సామాన్యులకు ఉండదు. ఎప్పుడైతే ధ్యానం చేస్తామో! మన మేధస్సుని పెంచుకుంటామో! బుద్ధిని వికసింప చేసుకుంటామో! అప్పుడు మాత్రమే చూసిన ప్రతి దాని యొక్క యదార్ధ స్థితిని తెలుసుకోగలిగే శక్తి మనకి వస్తూ ఉంటుంది.

ఎందుకంటే మనం ఎన్నో సంవత్సరాల నుంచి ధ్యానం చేస్తున్నాము, జ్ఞానం వింటున్నాము. కాబట్టి ఒక్కొక్క మెట్టు ఎక్కుతూ, ఇంకా చివరి మెట్టు రాలేదే అని నిరాశపడకుండా, ఇంకా నేను నేర్చుకోవాల్సింది చాలావుంది అని అనుకోవాలి.

లోకంలో ధ్యానమని రకరకాల సాధనలు చేయిస్తున్నారు. కాని ఏ సాధన సరైనదని తెలుసుకోవాలి అంటే? "ఏ సాధన అయితే పరలోకం గురించి కానీ, పరమాత్మ గురించి గానీ, తెలుసుకోగలిగే శక్తిని ఇస్తుందో! అదే అసలైన

సాధన". మిగతావన్నీ అసలైన సాధనలు కావు. ఆ విషయం గ్రంథాలు చెప్తున్నాయి. "శ్వాస మీద ధ్యాస" సరైన ధ్యానం అని పత్రి గారు ఎన్నో చూసి, చూసి అవపోసన పట్టి, అన్నిటినీ ప్రాక్టీస్ చేసి, ఇదే సరైనదని అన్నారు. మనం ఎన్నో రకాల ధ్యానాలు చూస్తున్నాము. మరి అవన్నీ ఆ పరమాత్మ గురించి జ్ఞానాన్ని ఇస్తున్నాయా అంటే? లేదని చెప్పవచ్చు.

మహాత్ములు సృష్టి గురించి పరమాత్మ గురించిన విద్యను "పరావిద్య", "అపరా విద్య" అని చెప్పడం జరిగింది.

"పరావిద్య" అంటే పరమాత్మ గురించి తెలియచేసేది. "అపరా విద్య" అంటే ఆయన సృష్టి గురించి తెలియజేసేది.

పెద్దలు ముందు "అపరా విద్య" నేర్చుకుని, తరువాత "పరావిద్య" లోకి అడుగు పెట్టాలి అన్నారు. ఎంచేతనంటే? అపరా విద్య లేకపోతే పరావిద్య ఎలా నేర్చుకోగలరు? అందుకే ఆ ఋషులందరూ మనకిగ్రంథ రూపకంగా ఇవ్వడం జరిగింది. వారు ధర్మాలు ఇచ్చారు, శాస్త్రాలు ఇచ్చారు, పురాణాలు ఇచ్చారు. ఎందుకు ఇచ్చారు? అందరూ చదివి నేర్చుకోవాలనే!

ఆధ్యాత్మిక చదువులు గొప్పవే! కానీ ప్రాపంచిక చదువులు కూడా కావాలి. ప్రాపంచిక చదువులు ఉంటేనే అధ్యాత్మిక చదువులు చదవగలరు.

లోకంలో నాలుగు రకాల జ్ఞానాలు ఉన్నాయి. అవి

1. సామాన్య జ్ఞానము, 2. విశేష జ్ఞానము, 3.పరాజ్ఞానము, 4. పరమాత్మ జ్ఞానము.

**1.సామాన్య జ్ఞానము:-** ఈ లోకంలో ఏ వస్తువు, ఎలా ఉపయోగపడుతుందో? తెలుసుకోవడం. ఆ వస్తువు యొక్క ప్రాముఖ్యత ఏంటి? అన్నది నేర్చుకుంటారు. అంటే లోకంలో 84 లక్షల రకాల జీవులు, జీవరాశులు వున్నాయని పెద్దలు చెప్పడం జరిగింది.

వాటినే ఖనిజాలు, శిలలు, వృక్షాలు, భూచరాలు, జలచరాలు, పక్షులు, జంతువులు, మానవులు ఇలా సృష్టించబడ్డాయి. ఈ సృష్టింపబడిన వాటిలో

శిలలు వున్నాయి. ఏ శిలకి, ఏ క్వాలిటీ ఉంది? వాటిని దేనికి ఉపయోగిస్తారు? అందులో ఉన్న మెటీరియల్ ఏంటి? ఎందుకు సృష్టించబడింది? అన్నవి తెలుసుకోవాలి.

పూర్వం ఆయుర్వేద వైద్య శాస్త్రం కనుగొనబడింది. ఏ మొక్కలో, ఏ వైద్య గుణాలు వున్నాయో, ఆ శాస్త్రాన్ని అధ్యయనం చేసిన ఆయుర్వేద వైద్యులకి తెలుసు. యుద్ధంలో గాయాలవుతే, ఆకు పసరు ఆ గాయానికి రాస్తే, మర్నాటికి ఆ గాయం మానిపోయేది. అలాగే దెబ్బలకు, రోగాలకు కూడా ఆయుర్వేదంలో మందులు వున్నాయి.

అలాగే ఎక్కడెక్కడ భూగర్భంలో ఏ ఖనిజాలు ఉన్నాయి? అన్నది తెలుసుకోవాలి. అవి ప్రజలకు ఏ విధంగా ఉపయోగపడతాయి, ఎన్ని రకాలుగా వాటిని ఉపయోగించవచ్చు అన్నది కూడా తెలుసుకోవాలి.

దీన్ని బట్టి ప్రపంచ జ్ఞానం తెలుసుకోవాల్సింది ఎంతో ఉంది అని తెలుస్తుంది. ఒకరకంగా భగవంతుని సృష్టి గురించి నేర్చుకోవడానికి ఒకజన్మ సరిపోదు.

అలాగే ఎగిరే పక్షులు ఎలా ఎగురుతున్నాయి? అలాగే నాలుగు కాళ్ల జంతువుల్లో, కొన్ని సాధు జంతువులు, కొన్ని క్రూర మృగాలు వున్నాయి. వాటి ఉపయోగం ఏమిటి? లాంటివెన్నో తెలుసుకోవాలి. ఎందుచేతనంటే సృష్టిలో సృష్టింపబడిన ప్రతీ దానికి ఏదో కారణం వుంది. కారణం లేకుండా ఏదీ సృష్టించబడలేదు.

అందుకే బుద్ధుడు చెప్తాడు, సృష్టిలో ఏదీ కూడా నిరర్థకం కాదు అని.

మరి ఇప్పటి డాక్టర్లు, మానవ దేహం గురించి అధ్యయనం చెయ్యకపోతే, ఈ డాక్టర్ వృత్తి చేసేవారా? అలాగే మెడిసిన్ గురించి అధ్యయనం చెయ్యకపోతే, మనకి ఆ మెడిసిన్ ఇవ్వగలిగేవారా?

సముద్రం ఉంది, సముద్రంలో నీరు ఆవిరిగా, మేఘాలుగా, మారి మరలా వర్షాలుగా పడి నదులుగా తయారవుతున్నాయి. మరల నదులు

పంటలకు, జీవులకు ఉపయోగపడి, ఎన్నో లాభాలు చేకూర్చి చివరకు సముద్రంలో కలుస్తున్నాయి. అంటే ఈ నదుల్లో నీళ్లన్నీ సముద్రం తాగుతున్నట్టే లెక్క.

వేదం ఏం చెప్పింది? సృష్టి గురించి చెప్పింది, అంటే ఒక్కొక్కటి ఎలా ఉంది? అని ఋగ్వేదం చెప్పింది. మరి "వేదవ్యాసుడు" ఎందుకు మనకి ఇచ్చాడు? ఇవన్నీ నేర్చుకుని చివరకు ఇదంతా ఆ పరమాత్మదే అని తెలుసుకోవడానికి.

మరి పూర్వం ఆయుర్వేద శాస్త్రజ్ఞులు, ఆ శాస్త్రాన్ని చదివి ఆ లక్షణాలను బట్టి, ఆ మొక్కను తెలుసుకుని, ఆ మందులు తయారు చేసేవాళ్లు. మరి అటువంటి మొక్కలు ఈ సృష్టిలో ఎందుకు ఇవ్వబడ్డాయి?

సస్యాలు, పండ్లు, కూరగాయలు లాంటి తినడానికి ఉపయోగించే మొక్కలు, వృక్షాలు. అలాగే వైద్యానికి కూడా ఉపయోగపడే, మొక్కలు ఈ సృష్టిలో వున్నాయి. ఇన్ని రకాల మొక్కలు, వృక్షాలు గురించి తెలుసుకునేదే సామాన్య జ్ఞానం.

**2. విశేష జ్ఞానం:-**

విశేష జ్ఞానం అంటే "న్యాయం", "ధర్మం" గురించి తెలిపేదే విశేష జ్ఞానం. అంటే సామాన్య జ్ఞానం కనిపించే దాని గురించి అధ్యయనం చేయగలిగితే, విశేష జ్ఞానం కనిపించని న్యాయం, ధర్మం గురించి, తెలియ చెప్పేది. అయితే ఒక మనిషి ఎలా ప్రవర్తించాలి? ఎలాంటి ఆహారం తీసుకోవాలి? ఎలాంటి వ్యవహారం ఉండాలి? ఇలాంటివన్నీ విశేషజ్ఞానంలో ఉంటాయి.

ఎవరో ఎవరినో హత్య చేస్తే, శిక్ష ఉంది. హత్యేకాదు తప్పులు చేసినా, పాపాలు చేసినా భగవంతుని ధర్మాలప్రకారం శిక్షలు పడతాయి. అలాగే కోర్టులలో కూడా శిక్షలు ఉన్నాయి.

చూడండి ఉరిశిక్ష పడ్డాక దాన్ని అమలుచేసే తలారి వుంటాడు, అమలు

చేసాడు. ఇక్కడ తలారి ఉరి వేసి చంపినా వాడికి శిక్ష వుండదు. కారణం వాడిది డ్యూటీ, ఇంకొకడిది నేరం. అందుచేత ధర్మం, ఒక్కొక్కరి విషయంలో ఒకోలా ఉంటుందని తెలుసుకోవాలి. అలాగే ధర్మం అన్నియుగాలకి ఒకేలాగా ఉండదు. ఒక్కొక్క యుగంలో ఒక్కొక్క లాగ మారుతూ ఉంటుంది.

భారత యుద్ధం ఐపోయాక, భీష్ముడు కృష్ణుల వారిని అడిగాడు. కృష్ణా "యుద్ధం అంతా ధర్మంగానే జరిగిందంటావా?" అని. అప్పుడు కృష్ణుడు తాతా, నీకు తెలియదా! ధర్మంగా జరిగిందో! అధర్మంగా జరిగిందో! అవతల వ్యక్తిని బట్టి ధర్మం మారుతూ ఉంటుంది.

ఏమిటంటే? త్రేతాయుగంలో, రావణాసురుని ధర్మపరంగా చంపవలసి వచ్చింది. కారణం రావణాసురుడు గొప్ప భక్తుడు. గొప్ప సాధన చేశాడు, గొప్ప జ్ఞానము పొందాడు. కాని అహంకారంతో తప్పు చేశాడు. అప్పుడు ధర్మ యుద్ధం జరిగింది.

ఈ యుగంలో "ధర్మము లేదు". ఎదుటివాడికి హాని చేయాలని చూసే వారు, మాయ తోటి, కుతంత్రాలతో, ఎదుట వారివి దోచుకోవాలన్న స్వభావంతో వున్నారు. పాండవుల రాజ్యం వాళ్లకి ఇవ్వకుండా, వాళ్ళని చంపటానికి సిద్ధమయ్యారు. అధర్మంగా వారిని కష్టాలు పాలు చేశారు. అంతేకాదు అధర్మం అని తెలిసినా అధర్మం పక్షాన ఉన్న వాళ్ళని, "అధర్మంగానే చంపాలి". ఇది ద్వాపర యుగధర్మం.

కలియుగంలో, అధర్మం చేసిన ప్రతి వాడిని చాలా కఠినంగా శిక్షించాలి. ఇది కలియుగ ధర్మం. ఆలా ధర్మం యుగాలను బట్టి మారుతుందని కృష్ణుడు చెప్పాడు.

ఇప్పుడు ప్రపంచంలో అన్నదమ్ముల మధ్య కొట్లాటలు, భార్యాభర్తల మధ్య పోట్లాటలు, పిల్లలు తండ్రి మధ్య పోట్లాటలు, తల్లిదండ్రులను కొట్టే పిల్లలు, తల్లిదండ్రుల మీద జాలి పడని కొడుకులు, ఇది ధర్మం కాదు.

ధర్మం కాని విధంగా ప్రవర్తించిన వాడికి భగవంతుని సృష్టిలో జాలి

వుండదు.

మరి ధర్మము, అధర్మము తెలిసినప్పుడు, వాడు తప్పు చేసిన వాడి పక్షాన యుద్ధం చేయడానికి ఒప్పుకుంటే, అధర్మాన్ని ప్రోత్సహించినట్టే కదా? అది భగవంతుడు దృష్టిలో తప్పే కదా? అందుకే కృష్ణుడు ధర్మం పక్షాన వుండి, అధర్మం పక్షాన ఉన్నవారందరినీ చంపించడం జరిగింది. ఆ యుగధర్మం అది. ఆ యుగమే కాదు, ఏ యుగానికైనా, ప్రాపంచిక శిక్ష నుంచి తప్పించుకోవచ్చు కానీ, పరమాత్మ నుంచి శిక్షను తప్పించుకోలేరు.

అందుకే ప్రతి ఒక్కరూ "న్యాయం గురించి", "ధర్మం గురించి" తెలుసుకోవాలి.  విశేష జ్ఞానంలో సత్యము గురించి తెలుసుకోవాలి అని చెప్పలేదు.

న్యాయం అంటే ఏంటి? ధర్మమంటే ఏంటి? ఈ రెండిటిని  క్షుణ్ణంగా తెలుసుకోవాలి. మానవుడికి బుద్ధి వుంది, అన్నీ తెలుసుకోగలడు.  ఏ జంతువు న్యాయ శాస్త్రం చదవలేదు. మానవుడు ఏది ధర్మం? ఏది న్యాయం? తెలుసుకున్నప్పుడు, ఎవరి విషయంలో అధర్మంగా ప్రవర్తించడు, అన్యాయంగా ప్రవర్తించడు. ఈ విశేష జ్ఞానంలో "న్యాయం గురించి", "ధర్మం గురించి" చెప్పడం జరిగింది.

ఈ రెండు నేర్చుకుంటేనే ప్రాపంచికంలో సంఘం పట్ల, సంసారం పట్ల, బంధుజనుల పట్ల,  అందరి పట్ల ధర్మంగా వ్యవహరిస్తారు. చూడండి ప్రస్తుతం తన వాళ్లు అంటే తప్పు చేసినా క్షమించగలుగుతున్నాడు, కాని వాళ్ళు అంటే చిన్న తప్పు చేసినా విమర్శిస్తున్నారు. అంటే "ధర్మము" అర్థం కాలేదు. న్యాయం అర్థం కాలేదు.

ఈ రెండు అర్థమైనప్పుడు తన వాడు తప్పు చేసినా  దండించగలిగే ధైర్యం ఉంటుంది. తప్పు చేస్తున్నప్పుడు మనము సమర్థిస్తున్నాము అంటే, మనలో ఇంకా ఏదో తప్పుడు లక్షణం వుంది అని అర్థం.

ఈ ఆధ్యాత్మిక జీవితంలోకి వచ్చాక,  ప్రతి నిమిషం  ఎరుకతో వుండాలి.

నేను ఏదైనా తప్పు చేస్తున్నానా? అన్యాయంగా తీర్పు ఇస్తున్నానా? అన్యాయంగా వ్యవహరిస్తున్నానా? అన్యాయంగా మాట్లాడుతున్నానా? అధర్మం వైపు నడుస్తున్నానా? అన్నవి ఆలోచించుకోవాలి, లేకపోతే ఇవన్నీ కర్మల రూపంలో అనుభవించవలసి వస్తుంది.

వశిష్టుల వారు బోధించిన యోగ వాశిష్టం చదివితే కర్మ సిద్ధాంతం యొక్క నిగూఢత్వం ఏమిటో తెలుస్తుంది. మరి ఇవన్నీ చదువుతున్నప్పుడు ప్రతి క్షణము భయపడవలసి వస్తుంది. ఎందుచేతనంటే? చేతలే కాదు మాటలు కూడా కర్మలే కాబట్టి.

ఎందుకంటే సత్యాన్ని పట్టుకున్నవారు "పరమాత్మ దృష్టిలో ఏది తప్పు అనుకుంటారో ఆ తప్పు చేయకూడదు". అందుకే విశేష జ్ఞానంలో ఏం చెప్పారు? జీవుడు, "న్యాయం, ధర్మం" తెలుసుకొని ప్రవర్తించాలి అని. కారణం భగవంతుడు సృష్టించిందే ధర్మం కనుక.

దొంగతనం నేరమని చెప్పనక్కర్లేదు. పరమాత్మ దృష్టిలో అది తప్పని ఎప్పుడో ఉంది. అబద్ధం, వ్యభిచారం, మందు త్రాగడం, జూదం ఆడటం పాపం అని భాగవతంలో ఉన్నాయి. "న్యాయము, ధర్మము" తప్పిన వారు ఎంతటి మహాత్ములైనా శిక్ష తప్పదు. రాక్షసులు ఈ రెండు తప్పబట్టే పతనమయ్యారు!

సృష్టికర్త సృష్టించాడు అంటే దాని ఉపయోగం వుంటుంది. ఒక ధర్మాన్ని పెట్టాడు అంటే, ఆచరించవలసిందే! ధర్మంగా ఉన్నవాడు సాత్విక గుణంలో వుంటాడు, అధర్మంగా ఉన్నవాడు రాజసగుణంలో ఉంటాడు. ఆ రాజసగుణం ఉన్నవాడు ధ్యానం చేసినా, సొంత లాభమే ఆశిస్తాడు. సాత్విక గుణంలో వున్నవాడు, ధ్యానం చేస్తే ధర్మాన్ని తెలుసుకొని, విశ్వ కళ్యాణం కోసం పాటుపడతాడు.

భగవంతుని సృష్టిలో ప్రతి ఒక్కరు అన్ని నేర్చుకునేవే, ఉపయోగపడేవే, భగవంతుడు వృధాగా ఏది సృష్టించడు. ఎవరైనా సరే నాకు తెలియనంత

మాత్రాన అది ఉపయోగం లేదు అని అనుకోకూడదు, అని నేర్చుకోవాలి. అంతేకాదు సృష్టిలో ఉన్నవన్నీ అంగీకరించాలి. ఎందుచేతనంటే? భగవంతుని సృష్టిలో చీమ నుంచి, పిపిలాది బ్రహ్మ పర్యంతం అన్నీ ఆ భగవంతుని సృష్టే! అన్నీ ఉపయోగ పడేవే.

కాని మనకి తెలియనప్పుడు, అవి ఉపయోగం లేదు అని అనుకుంటాము. కాని ఇన్ని రకాల 'జ్ఞానాలు' మహాత్ములు వివరించి ఇచ్చారు. మరి వేదాల్లో కూడా గణిత శాస్త్రము అని, వ్యాకరణ శాస్త్రం అని, చందస్సు అని ఎందుకు ఇచ్చారు? చదువే రాకపోతే ఇవన్నీ ఎలా అధ్యయనం చేస్తారు?

అందుకే సృష్టిలో ఉన్న ప్రతిదీ, ఏ జీవికి ఏమేమి కావాలో, అవి సృష్టించి ఇవ్వబడ్డాయి. కానీ, మానవ జన్మలో అన్నీ తెలుసుకోవాల్సిన అవసరం వుంది. ఎందుకంటే? బుద్ధి వుంది కాబట్టి, ఆ బుద్ధితో ఇవన్నీ నేర్చుకుంటూ, ముందుకు వెళ్లాలి.

ఇప్పుడు చాలా టెక్నాలజీ వచ్చింది. చదువు రాకపోతే, ఆ టెక్నాలజీ ఎలా ఉపయోగించుకుంటారు? అందుచేత ఈ "సామాన్య జ్ఞానం", "విశేష జ్ఞానం" తెలుసుకోవలసిన అవసరం ఎంతైనా వుందని తెలుసుకోండి.

# పరాజ్ఞానము

ఇప్పుడు ఆధ్యాత్మిక జ్ఞానం గురించి తెలుసుకుందాము. ఈ ఆధ్యాత్మిక జ్ఞానంలో రెండు రకాలు వున్నాయి.

1. పరాజ్ఞానము, 2.పరమేశ్వర జ్ఞానము

ఈ రెండు మానవుడు జీవించి ఉండగానే తెలుసుకోవాలి. ఈ పరాజ్ఞానం అనేది పరలోక జ్ఞానం.

పరమాత్మ జ్ఞానం అంటే భగవంతునికి సంభందించిన జ్ఞానం.

సామాన్య మానవుడికి  చనిపోయిన తర్వాత మాత్రమే పరలోకంలో ఏమవుతుందో తెలుస్తుంది? కాని ఆవిషయం చనిపోక ముందు తెలియదు. చాలామంది వాటి గురించి  ఇప్పుడు ఎందుకు? భూమ్మీద ఉన్నవి తెలుసుకుంటే చాలదా? అంటారు.

కాని మరణానంతరం అసలు ఏమవుతుంది? ఎన్ని లోకాలు వున్నాయి? ఊర్ధ్వ లోకాలకు వెళ్లాలా? అధోలోకాలకు  వెళ్లాలా?  అనేది ఈ భూమి మీదే తెలుసుకోవాల్సిన విషయం. మానవజన్మ దేనికి అంటే? ఈ భూమి మీద ఉండగానే 'తానెవరో' తెలుసుకోవాలి.  ఎక్కడి నుంచి వచ్చాడో? ఎక్కడికి వెళ్లాలో? కూడా తెలుసుకోవాలి.

మరి  తెలుసుకోకపోతే, తెలుసుకోవడానికి మరల, మరల జన్మలు తీసుకోవాల్సి వస్తుంది. అందుకే  వేదాలలో ఈ జ్ఞానం గురించి ఇవ్వబడింది. ఎందుకు? అంటే మనం తెలుసుకోవడానికే. మరి అది తెలుసుకోకుండా దేహం వదిలి వెళ్ళిపోతే,  తెలుసుకోవడానికి మరల భూమ్మీదకి రావాల్సి వస్తుంది.

ఈ పరాజ్ఞానంలో ముఖ్యంగా మానవుడు జన్మించక ముందు ఎక్కడ వున్నాడు? ఎక్కడి నుండి వచ్చాడు? మరణానంతరం, ఎక్కడికి వెళ్తాడు? ఈ చరాచర జగత్ అంతా ఎలా సృష్టించబడింది? ఈ "సృష్టి, స్థితి, లయ" కారకులు ఎవరు? అన్న విషయాలు తెలుసుకోవలసి వుంటుంది.

ఇలాంటి ప్రశ్నలకు సమాధానం జ్ఞానులే తెలుసుకోగలరు. కాని సామాన్యులు వీటికి ప్రాముఖ్యం ఇవ్వరు. ఎంతసేపూ పుట్టామా? పెరిగామా? అనుభవించామా? వెళ్ళిపోయామా? అన్నవి మాత్రమే ఆలోచిస్తారు. కాని పరాజ్ఞానం తెలుసుకుంటే? మానవుని జీవన విధానమే మారిపోతుంది.

ఈ ధ్యానమార్గంలోకి వచ్చి జ్ఞానం పొందాక ఈ సృష్టిలో "ఏడు ఊర్ధ్వ లోకాలు", "ఏడు అధోలోకాలు" ఉన్నాయి అనే విషయం తెలుస్తుంది. అంతేకాదు మానవుడు ఈ మానవజన్మే కాదు, 84 లక్షల రకాల జీవరాసుల జన్మలు తీసుకున్నాము అన్న సంగతి తెలుస్తుంది. మరి ఇన్ని రకాల జన్మలు ఎందుకు? అంటే ఆత్మలైన మానవులు ఒక్కొక్క జన్మలో ఎన్నో అనుభవాలు పొందుతూ, పాఠాలు నేర్చుకుంటూ వుంటారు అన్నది కూడా తెలుస్తుంది.

ముఖ్యంగా ఈ ఆధ్యాత్మిక మార్గంలోకి వచ్చిన తర్వాత ధ్యానం చేసి జ్ఞానము పెంచుకుంటారు. అందుచేత చనిపోయిన తరువాత వీరు వెళ్ళే లోకాలు ఎన్నివున్నాయి? భూమిమీద చేసే కర్మలను బట్టి, పొందిన జ్ఞానాన్ని బట్టి ఏ, ఏ లోకాలకు వెళ్తారు? అన్నది తెలుసుకుంటారు.

పుణ్యం చేస్తే స్వర్గానికి, పాపం చేస్తే నరకానికి, అలాగే ధ్యాన సాధన చేసి జ్ఞానం పొందితే, ఇంకా ఇంకా పై లోకాలకు వెళ్తాము అన్నది తెలుస్తుంది. అంతేకాదు నేను శరీరం కాదు ఆత్మని, నేనే కాదు సృష్టిలో ప్రతి జీవి ఆత్మే, ఈ సృష్టి అంతా పరమాత్మే అని తెలుసుకున్నప్పుడు సత్యలోకానికి వెళ్ళగలుగుతారు. ఎవరైనా సరే చిట్ట చివరికి చేరుకోవాల్సింది సత్యలోకం.

కారణం సత్య లోకం అంటే భూమి మీదకు తిరిగి రాని లోకం. ప్రతి ఒక్కరూ ఎన్ని జన్మలు ఎత్తినా చివరకు చేరవలసిన లోకం సత్యలోకమే కాబట్టి.

ఈ చరాచర జగత్తు అంతా ఆ పరమాత్మే సృష్టించాడు. ఆయనచే ముందు పంచభూతాలు సృష్టించబడ్డాయి. ఈ పంచభూతాల ద్వారానే ఈ ప్రకృతి, ప్రకృతిలోని జీవులు సృష్టింపబడ్డాయి.

అందుచేత సృష్టిలో ఎన్నో రూపాలు ఉన్నా, అవన్నీ ఆ మూల చైతన్యం

నుంచి ఉద్భవించినవే! అని అంటారు. ఆ మూలచైతన్యాన్నే "పరమాత్మ" అని "పరబ్రహ్మ" అని కూడా అంటారు. అందుచేత అయనవల్లే ఈ సృష్టి అంతా జరిగిందని తెలుసుకోవాలి.

మరి ఈ సృష్టి, స్థితి, లయాలకు కారణం కూడా ఆయనే. కాని లోకంలో 'సృష్టించేది బ్రహ్మ', 'పోషించేవాడు విష్ణువు', 'లయం చేసేది శివుడు', అని అనుకుంటారు. కానీ ఈ 'సృష్టి స్థితి లయాలు' జరగడానికి కారణం పరమాత్మే ఉత్తర గీతలో, ఆ పరమాత్ముడే, చెప్పడం జరిగింది.

భూమితత్వంలో ఉన్నప్పుడు "బ్రహ్మగా" ఉంటాను.

జలతత్వంలో ఉన్నప్పుడు "విష్ణువుగా" ఉంటాను.

అగ్నితత్వంలో ఉన్నప్పుడు "ఈశ్వరుడిగా" ఉంటాను.

ఈ మూడు చేస్తున్నది "నేనే" అని చెప్పడం జరిగింది. అంతేకాదు.

వాయు తత్వంలో "శివుడిగా", ఆకాశ తత్వంలో " సదాశివుడిగా", వివిధ నామాలతో, రూపాలతో, ఈ కార్యక్రమాలు జరుపుతూ ఉంటాను అని చెప్పడం జరిగింది. దీనిని బట్టి రూపాలు, నామాలు వేరు అయినా ఆయాతత్వాల్లో, ఆ పరమాత్మ ఈ మూడు కార్యక్రమాలు చేస్తున్నాడు అని మనం తెలుసుకోవచ్చు.

మరి ఈ విధంగా మనం తెలుసుకుంటున్న కొద్ది ఈ 'పరమాత్మ జ్ఞానం' తెలుస్తుంది.

అందుచేత సృష్టికి కారణం పరమాత్మే! ఈ జీవుల సృష్టికి కారణం పరమాత్మే! ఊర్ధ్వ లోకాలు కానీ, అధోలోకాలు కానీ సృష్టించింది ఆ పరమాత్మే!

మానవులు ఆ పరమాత్మ నుంచి బిందువుగా విడువడి భూమ్మీదకి వచ్చి జీవుల శరీరాల్లో ప్రవేశించి, 'నేను' జీవుడిని అనే భావంతో ఉన్నారు. మరి ఆ భావం ఎప్పుడు పోతుంది అంటే? సద్గురువు దొరికి సరైన సాధన చేసినప్పుడు.

అలా సాధన చేసి, జ్ఞానం పొందినప్పుడు 'పరలోక జ్ఞానం' తెలుసు కుంటాడు. అలా భూమిమీద వేదనలు, బాధలు పడి, ఈ సుఖము, సంతోషము తాత్కాలికం అని తెలుసుకుని, అసలైన ఆనందం నా 'స్వస్థితే' అని తెలుసు

కున్నప్పుడు, నేను వచ్చింది అక్కడి నుంచే అన్న జ్ఞానమంతా వచ్చినప్పుడు, ఆ పరలోక జ్ఞానం బాగా తెలుసుకుంటాడు.

అలా జ్ఞానం పెరిగే కొద్దీ, లోక కళ్యాణకరమైన పనులు చేసే కొద్దీ, బ్రహ్మజ్ఞానం పొంది సృష్టిలో సమస్తమూ తెలుసుకుంటాడు. అందుచేత ప్రాపంచిక జ్ఞానం ఒక్కటే సరిపోదు, దానితో పాటు ఈ ఆధ్యాత్మిక జ్ఞానం అంటే ఈ పరలోక జ్ఞానం నేర్చుకోవాలి. ప్రతి ఒక్కరూ ఇది నేర్చుకోవాలంటే? ఒక సద్గురువును ఆశ్రయించాలి.

అందుకే శంకరాచార్యులు వారు, "మనుష్యత్వం, ముముక్షత్వం, మహాపురుష దర్శనం" ఈ లోకంలో దుర్లభం అని అన్నారు. అంటే మానవ జన్మ లభించడం అన్నది చాలా కష్టం. అలాగే లభించిన మానవజన్మను చివరి జన్మ చేసుకునే అవకాశం, ఆ మానవ జన్మకే ఉంది. కాబట్టి ముముక్షత్వం అంటే మోక్షం పొందాలనే కోరిక కలగటం కూడా అంత తేలిక కాదు. ఎందుచేతనంటే? ఎవరైనా ఎంతసేపూ భూమిమీద అనుభవించాలి, హాయిగా, సంతోషంగా జీవించాలి అన్న ఆరాటం తప్పించి, మోక్షం పొందాలి అనే కోరిక రావటం కూడా కష్టమే.

మరి ఈ రెండు కోరికలు ఉన్నా, ఒక మహా పురుషుడు అంటే ఒక సద్గురువు లభించడం కూడా చాలా కష్టం. ఈ మూడు ఉన్నవాడికి వేరే అదృష్టం అంటూ ఏమీ ఉండదు.

ఎందుచేతనంటే? మానవుడు మాయకు వశమై, బాధలకి, కష్టాలకి లోనై సమస్యలతో సతమత మవుతున్నారు. అందుకే భాగవతంలో నన్ను చేరుకోవాలి అంటే, నా మాయను జయించాలి అని చెప్పబడింది. దానికి 'శ్వాస మీద ధ్యాస' ధ్యానం ఒక్కటే మార్గము.

అలా సద్గురువు బోధతో ధ్యాన సాధన చేసి పరాజ్ఞానము, పరమాత్మ జ్ఞానము పొంది చివరకు మోక్షాన్ని పొందుతాం. అందుచేత ప్రతి ఒక్కరూ 'శ్వాస మీద ధ్యాస' ధ్యానాన్ని చేయాలి.

# అజ్ఞానుల గురించి వశిష్టుల వారు ఏం చెప్పారు?

చాలా మంది అభిప్రాయం ఏమిటంటే? ధ్యానం చేసి, పూర్ణజ్ఞానం పొందితే మోక్షం వస్తుంది అనుకుంటారు. కానీ మోక్షం పొందినా వారు పూర్ణ పురుషులు కాలేరు. తనలాగ మరి కొంతమందిని భూమి మీద తయారు చేస్తేనే పూర్ణపురుషులవుతారని “సూతపురాణంలో” శివుడు ఋషులకు చెప్పడం జరిగింది.

అందుచేత భూమిమీద మనం ఎంత పొందామో అది విశ్వానికి ఇవ్వాలి. ఇవ్వకపోతే మరల భూమి మీదకి రావాలి. ఇది “ ప్రకృతి సిద్ధాంతం”.

దీనినే పత్రిగారు “తీర్థంకర గోత్ర బంధం” అన్నారు. అంటే మానవుడు పొందినది ప్రతిదీ కూడా అందరికీ ఇవ్వాల్సిందే. అదే మోక్షం.

పత్రి గారు ముగ్గురు గురించి చెబుతూ వుంటారు.

1. అరిహంతుడు. 2. బోధిసత్వుడు. 3. బుద్ధుడు

1. అరిహంతుడు అంటే తనకుతాను ధ్యాన సాధన చేసుకునేవాడు.

2. బోధిసత్వుడు అంటే తన దగ్గరకు వచ్చిన వారికి ధ్యానం, జ్ఞానం బోధించేవాడు.

3. బుద్ధుడు అంటే తానే ఇతరుల వద్దకు వెళ్లి బోధించేవాడు.

వీరిలో బుద్ధుడే గొప్పవాడు.

మనం విన్నది, పుస్తకంలో చదివినది బయటకు వెళ్లి ఇతరులకు చెబితేనే మనలో జ్ఞానం పెరుగుతుంది. అందుకే పత్రిగారు “పంచింది పెంచబడుతుంది” అన్నారు.

కానీ ఎవరికి చెప్పకపోతే మర్చిపోతాం, ఏమి గుర్తు ఉండదు. నీవు చదివింది నీ మస్తకములో వేసినప్పుడు, చదివింది గుర్తుంటుంది. అది నీవు క్లాసులకు వెళ్ళినప్పుడు నీకు గుర్తుకు వస్తుంది. అప్పుడు నీవు చెప్పగలగుతావు.

ఏ టైంకి ఎలా ఉంటామో ఎవరికి తెలియదు. రేపు మనది కాదు,

ఈరోజే మనది. అందుకే చెప్పగలిగినంతా చెప్పాలి అని పత్రిగారు చెప్పారు. చెప్పాల్సింది చెప్పినప్పుడే చాలా కరెక్టుగా ఎదుగుతాము. నీవు పొందింది చెప్పకుండా ఉత్తినే ధ్యానం మాత్రం చేస్తే పూర్ణజ్ఞానులం కాలేము.

అజ్ఞానికి, జ్ఞానం ఎంత  బోధించినా మనం వారిని బంధించి చెపుతున్నట్లుగా  అనుకుంటారు.

అందుకే వశిష్టుల వారు నాలుగు విషయాలు చెప్పారు.

1. వివేకం లేని వాడికి శాస్త్రం బరువు
2. వైరాగ్యం లేని వాడికి జ్ఞానం బరువు.
3. శాంతి లేని వాడికి మనసు బరువు.
4. ఆత్మజ్ఞానం లేని వాడికి శరీరం బరువు.

ఇవన్నీ కచ్చితంగా అజ్ఞానికి ఉంటాయి. వాటి గురించి తెలుసుకుందాం.

**1. వివేకం లేనివాడికి శాస్త్రం బరువు:-** ఎందుకంటే వాడికి  ఏది సరైనది - ఏది సరికానిది,  ఏది ధర్మం - ఏది అధర్మం, ఏది న్యాయం - ఏది అన్యాయం, ఏది సక్రమం - ఏది అక్రమం,  ఏది సత్యం - ఏది అసత్యం  అన్నది వివేకం లేనివాడికి తెలియదు. ఇవన్నీ ధ్యానం చేసి వివేకం సంపాదించుకుని  శాస్త్రం అధ్యయనం చేసిన వాడికి తెలుస్తుంది.

భగవద్గీత, భాగవతాలు చూస్తే పంచ మహాపాపాలు గురించి తెలుస్తుంది.

1. త్రాగుడు, 2.జూదం, 3.వ్యభిచారం, 4.అబద్ధం, 5.హింస.

ఇవన్నీ పంచ మహా పాపాలు. వాటివల్ల ఎన్ని బాధలు, కష్టాలు అనుభవించాలో తెలుస్తుంది అప్పుడు ఆ పంచ మహా పాపాల జోలికి వెళ్లరు.

అందుకే ఏది మంచిది - ఏది చెడ్డది అన్నది శాస్త్రాలు చదివితేనే అర్థం అవుతుంది. ఒక్క భగవద్గీత చాలు జీవితాన్ని మార్చడానికి. అలాంటి భగవద్గీతలోని ఒక్క శ్లోకం కూడా చదవని మూర్ఖులు ఈ కలియుగంలో వున్నారు. వాళ్లకు తెలిసింది ఒక్కటే! కోట్లకు కోట్లు డబ్బు దోచుకోవడం, దాచుకోవడం.

శాస్త్రాలు చదివితే ధర్మమేమిటో అర్థం అవుతుంది. కాని చదివే వివేకం

జనాలకు లేదు. అందుకే అజ్ఞానులకు వివేకం లేక, శాస్త్రాలు అక్కర్లేనివిగా భావిస్తున్నారు. అవి చదివినా మాకు అర్థం కావు అని ఒక్క మాట అనేస్తారు.

కానీ ఎంత అజ్ఞాని అయినా కొంత సమయం వాటి కోసం కేటాయించాలి. ధ్యానం చేసి, జ్ఞానం సంపాదిస్తే ప్రతి ఒక్కరి జీవితంలో ఆనందమే ఉంటుంది.

అందుకే వశిష్టుల వారు వివేకం లేని వారికి “ఈ శాస్త్రాలు అన్నీ బరువుగా అనిపిస్తాయి” అన్నారు. ఎందుకు అంటే? శాస్త్రాలు వారికి అర్థం కావు, ఆచరించలేరు. ఆలా అజ్ఞానంలో పడి కొట్టుకుపోతారు.

వీరి పరిస్థితి ఎలా ఉంది అంటే? ఒక ఊబిలో పడిన వాడు కూరుకు పోవడమే గాని బయటకు రాలేడు. అలాగా వీరు కష్టాలు, దుఃఖం అనే ఊబిలో కొట్టుకు పోతారు.

**2. వైరాగ్యం లేని వాడికి జ్ఞానం బరువు అన్నారు:-**

అజ్ఞానంలో వున్న వాడికి ప్రతి దాని మీద మమకారం ఉంటుంది. ప్రపంచంలోని వన్నీ కూడా మన ఇంద్రియాల భోగం కోసమే ఉన్నాయి అనుకుంటాడు. ఇంద్రియాలను భోగం కోసమే ఉపయోగిస్తాడు. అంతేకాదు నేను శరీరం కాదు నేను ఆత్మని అనే జ్ఞానం పొందడానికి ఇష్టపడడు. మరి వీడికి జ్ఞానం ఎలా వస్తుంది.

వాడికి ఈ ప్రపంచం అసత్యం, ఆత్మే సత్యం అని చెప్పినా వాడికి అర్థం కాదు. అలా ప్రపంచం మీద మోజు పెంచుకుంటే, ఇంద్రియాలకు దాసులైనట్లే. ఎంత చెప్పుకున్నా ఆ ఇంద్రియాలకు దాసులు కాని వారు, చాలా తక్కువ మంది ఉంటారు. అందుచేత కళ్ళు మూసుకుని ప్రపంచాన్ని వదిలిపెట్టినప్పుడు నీ సాధన కుదిరి జ్ఞానం పెరుగుతుంది.

ప్రపంచం మీద వైరాగ్యం లేనంతసేపు జ్ఞానం చాలా కష్టంగా, బరువుగా ఉంటుంది. చూడండి ఒక పెళ్ళికో, పార్టీకో వెళతారు, లేకపోతే సినిమాకు వెళతారు. ఆలా ఎన్ని గంటలు అయినా గడిపేస్తారు. కానీ ధ్యానం కోసం

ఎన్ని గంటలు కేటాయిస్తున్నారు? ఆలోచించండి!

నీకు ఇంద్రియాల మీద మమకారం తగ్గినప్పుడు ప్రపంచం మీద మమకారం తగ్గి, ధ్యానం కుదిరి జ్ఞానం వస్తుంది. అందుకే వీసమెత్తు వైరాగ్యం ఉన్నా ఎంతో సాధించవచ్చు. కానీ ఎప్పటికప్పుడు మీకు వయసు పెరుగుతుంది. జుట్టు నెరుస్తుంది, పళ్ళు వూడతాయి మృత్యువు దగ్గర అవుతుంది. అలా ముసలివాడివి అవుతున్నా కూడా ప్రపంచాన్నే పట్టుకుంటున్నావు కాని, పరమాత్మను పట్టుకోలేకపోతున్నావు.

అజ్ఞాని ఎవరైనా చనిపోతే, వెళ్ళి పోయాడు అని అనుకుంటాడు. కానీ తాను చనిపోను అన్నట్లుగా ఉంటాడు.

అజ్ఞాని ప్రపంచం శాశ్వతం అనుకుంటాడు, కాని ప్రపంచం అశాశ్వతం అనుకుంటే వైరాగ్యం వస్తుంది. ఆ వైరాగ్యం లేనంత కాలం జ్ఞానం పెరగదు. అందుకే వైరాగ్యం లేని వాడికి జ్ఞానం బరువుగా ఉంటుందని చెప్పడం జరిగింది.

**3. శాంతి లేనివాడికి మనసే బరువు:-**

ఎవరికి శాంతి ఉండదు? అంటే తృప్తి లేని వాడికి శాంతి వుండదు. ఒకప్పుడు కటిక దరిద్రం అనుభవిస్తూ ఒక్క పూట తినడానికి కూడా కష్టంగా ఉండేది, కాని ఇప్పుడు రెండు పూటలా తింటున్నప్పుడు, అప్పటికంటే ఇప్పుడు నా జీవితం బాగుంది అని అనుకుంటే నీవు తృప్తిగా ఉంటావు. కాని ప్రక్కవారి కోట్లతో పోల్చుకుంటే అసంతృప్తితో అశాంతిగా ఉంటావు. అలాంటి అశాంతి వలన మనసు బరువుగా అనిపిస్తుంది.

దుఃఖంలో ఉన్నా మనసు బరువుగా ఉంటుంది. శాంతిగా వుంటేనే మనసు తేలికగా ఉంటుంది. అసంతృప్తితో ఉంటే సరైన వ్యవహారం ఉండదు, ఏదీ చెయ్యలేరు, ప్రతిదానికి బాధపడుతూ ఉంటారు. అందుకే మలయాళ స్వామి ఏమంటారంటే? కారు లేదు అని బాధపడకు కాళ్లు ఉన్నాయని సంతోషించు" అంటారు. అప్పుడు నీవు తృప్తిగా ఉంటావు, శాంతిగా జీవిస్తావు అంటారు.

**4. ఆత్మ జ్ఞానం లేని వాడికి శరీరం బరువు:-**

ఆత్మ జ్ఞానం ఉంటే ఈ శరీరాన్ని ఎందుకు తెచ్చుకున్నామో తెలుస్తుంది. జ్ఞానం వున్న ప్రతి ఒక్కరికి తెలుసు. ఈ శరీరం ఉన్న స్థితి నుంచి ఉన్నత స్థితికి ఎదగడానికి, జీవిత లక్ష్యం సాధించడానికి అని తెలుస్తుంది. జ్ఞానం లేనప్పుడు కష్టాలను శాపాలు అనుకుంటారు, కానీ జ్ఞానం పెరిగాక ఏది వచ్చినా వరాలు అనుకుంటారు.

ఈ సంవత్సరం ఒక లక్ష లాభం వచ్చింది వచ్చే సంవత్సరం 10 లక్షలు లాభాలు రావాలి అంటే దానికి తగ్గ కృషి చేయాలిగా. చేసి కష్టపడితేనే డబ్బు వస్తుంది. అలాగే ఈ ఆత్మ జ్ఞానం కావాలి అంటే ఈ శరీరంతో కష్టపడి ధ్యానసాధన చేయాలి, జ్ఞానం పెంచుకోవాలి.

కష్టపడలేనివాడు నా వల్లకాదు అని బద్ధకిస్తే జ్ఞానం రాదు, తెచ్చుకున్న కర్మలు అనుభవించాలి. అప్పుడు కష్టాలు భరించలేక నావల్లకాదు అనుకుంటూ శరీరాన్ని విచ్ఛిన్నం చేసుకునేవారు అంటే ఆత్మహత్యలు చేసుకునేవారు, కష్టమంతా శరీరానిది అని అనుకుంటారు.

ఎందుకు అంటే వారికి జ్ఞానం లేక ఈ కష్టాలు పడలేకపోతున్నాను, నా మొగుడు వల్ల కష్టాలు అని, పెళ్ళాం వల్ల కష్టాలు అని, ఎవరో అవమానించారు అని, పరీక్షలు ఫెయిల్ అయ్యాను అని, ఇలాంటివన్నీ చేస్తున్నారు. ఈరోజు పిల్లలకు ఒక ర్యాంకు తగ్గినా సూసైడ్ చేసుకుంటున్నారు. ఎందుకు అంటే ఆ పిల్లలకు జ్ఞానం లేదు. జ్ఞానం ఉంటే ఎలా జీవించాలో అర్థం అవుతుంది.

ఒకరి కంటే ఒకరు గొప్పగా ఉండాలి అని ధన సంపాదనమీద దృష్టి పెడుతున్నారు కాని వీసవెత్తు జ్ఞానం పొందాలి అనుకోవడం లేదు.

జ్ఞానం వల్ల శరీరం మనం దేనికి తెచ్చుకున్నామో తెలుస్తుంది, ఎలా జీవించాలో తెలుస్తుంది. ఎంత ఆనందకరమైన జీవితం జీవించవచ్చో తెలుస్తుంది. కలిమిలో, లేమిలో, కష్టాల్లో, సుఖాల్లో, అవమాల్లో పొగడ్తలలో

అన్నిట్లో సమస్థితిలో ఉంటూ జీవితాన్ని ఎంజాయ్ చేయగలరు.

అందుకే ఆత్మ జ్ఞానం లేకపోతే శరీరం బరువు అనిపిస్తుంది. ఎందుకు ఈ శరీరం అనిపిస్తుంది. మృతాహారం అంటే మాంసాహారం తింటూ, మద్యం తాగుతూ ఉంటే ఈ శరీరం పాడైపోతుంది. అలాంటివి చేయకుండా శరీరాన్ని జాగ్రత్తగా చూసుకుంటే ధ్యానసాధాన బాగా కుదురుతుంది, జ్ఞానం పెరుగుతుంది. గీతలో చెప్పారు కదా

అజ్ఞానులు యోగంలో ఉంచవలసిన శరీరాన్ని భోగంలో ఉంచి శరీరం రోగాలలో కూరుకుపోయేటట్టు చేయడం వల్ల ఈ శరీరం బరువుగా అనిపిస్తుంది. కానీ జ్ఞాని ఏ కష్టం వచ్చినా కర్మ పోతుంది, నా బాకి తీరిపోతుంది అనుకుంటూ సంతోషంగా కర్మను అనుభవిస్తాడు. అందుకే  అజ్ఞానికి, ఈ జ్ఞానం లేక, ఈ శరీరం  బరువు అనుకుంటాడు.

అజ్ఞానంలో ఉంటే దుఃఖంతో నాకు శాంతి లేదు అని బతుకు మీద నిరాశ కలుగుతుంది. అందుకే పెద్దలు చెప్పింది ఎందుకు వినాలి? శాస్త్రం ఎందుకు చదవాలి? అంటే మనం ఏ పరిస్థితులలో ఉన్నామో తెలుసుకోవడం కోసం. జ్ఞానం తెలిసాక ప్రపంచం మీద వైరాగ్యం, ఆత్మ మీద మమకారం కలుగుతుంది. అలాంటి వారికి శరీరం బరువుకాదు.

అంపశయ్యపై ఉన్న భీష్ముడు ధర్మరాజుకు అనేక ఉపదేశాలు చేశాడు. అయితే ఒకరోజు భీష్ముడిని చూడడానికి వచ్చిన బృహస్పతిని ధర్మరాజు ఒక ప్రశ్న వేశాడు.

"ధ్యానం, ఇంద్రియ నిగ్రహం, అహింస, గురు సమర్పణ, నిత్య అనుష్టానం, తపస్సు" ఈ ఆరింటిలో ఏది అత్యుత్తమమైనది అని అడిగాడు.

అందుకు బృహస్పతి ఆ ఆరు  గొప్పవే కానీ అందులో "అహింస" అత్యుత్తమమైనది అని చెప్పి భీష్ముడి దగ్గర సెలవు తీసుకుని దేవలోకానికి వెళ్లిపోయాడు.

బృహస్పతి సమాధానం విన్న ధర్మరాజు అహింస గురించి మరింతగా

తెలుసుకోవాలనుకున్నాడు. అందుకు భీష్ముడితో ... పితామహ మునీశ్వరులంతా ముక్తకంఠంతో అహింస చాలా ఉత్తమం అని అంటున్నారు. అది ఎందుకు అంత గొప్పది? అని అడిగాడు.

అందుకు భీష్ముడు మాంసభక్షణ అనేది మహా పాపంతో సమానం. అయితే మాంసం రుచి మరిగిన వారు దానిని ఎన్నటికీ విడిచిపెట్టరు. అందుకే మాంసభక్షణను విడిచి పెట్టడమే అహింసగా ఆర్యులు  విశ్వసించారని తెలియజేశారు.

భీష్ముడు ఇంకా ధర్మరాజా! మాంసభక్షణను మానుకోవడం అశ్వమేధ యాగం కన్నా గొప్పది అని చెప్తూ,  వధించమని చెప్పడం, వధ ఈ రెండు మహాపాపాలు అని చెప్పాడు.

మాంసం మహా రుచిగా ఉంటుంది. అందుకే దానిని అందరూ ఇష్టపడతారు. అలాంటి ఇష్టమైన రుచిని మానుకుని మాంసాన్ని విసర్జించినవాడు దేవతలతో సరి సమానుడు అని పెద్దల ఉవాచ.

రాళ్ళల్లోనూ, చెట్లలోను మాంసం లభించదు. లభించేది ప్రాణుల వల్లనే! ప్రాణులను కత్తితో కండగా నరుకుతున్నప్పుడు, తన శరీరం కూడా అటువంటిదేనని మనిషి అనుకున్న పక్షంలో అతను అందుకు మళ్లీ పూనుకోడు.

మాంస భోజనాన్ని విడిచి పెడితే అతనిలోని హింసా ప్రవృత్తి దానంతట అదే పోతుంది. మాంసాహారాన్ని మానుకుంటే ఆయురారోగ్యాలు పెరుగుతాయని మార్కండేయాది మహర్షులు చెప్పారు. మాంసాహారం మానుకున్న కారణంగానే దేవతలు రాక్షసులను అవలీలగా గెలవగలిగారు.

దానం, ధర్మం, యజ్ఞ యాగాదులన్నీ అహింస ముందు దిగదుడుపే. నూరు సంవత్సరాలు చేసే తపఃశ్చర్య, మాంసాహారం మానుకోవడం రెండూ ఒకటే అంటారు పెద్దలు.

తపస్సు, దానధర్మాలతో బ్రహ్మలోకం లభించవచ్చు, లభించకపోవచ్చు. కానీ మాంసాన్ని ముట్టని వారికి చేసే సాధనల వల్ల బ్రహ్మలోకం ఇట్టే లభిస్తుంది

అని చెప్పాడు. ఆలా మాంసాహారానికి సంబంధించిన విషయాలు, అహింస గురించి భీష్ముడు వివరించగా!

అందుకు ధర్మరాజు పితామహ మాంసాన్ని విసర్జించడంలో ఇంత గొప్పతనం ఉంది కదా? మరి ఎందుకు మనుషులు మాంసాన్ని విసర్జించరు? అని ప్రశ్నించాడు.

అప్పుడు భీష్ముడు ఎందుకు విసర్జించరంటే? దానిలో కలిపే ఉప్పు, కారం, మషాలాల వల్ల అది మహా రుచిగా అనిపిస్తుంది. అంతేకాదు మాంసం తింటే బలమనే భావం మానవులలో వుంది. ఎంత దూరం నడిచినా అలుపు రాదు అనుకుంటారు. అందుకే దానిని వదలరు.

కానీ ప్రాణ భయం జీవాలన్నిటికీ ఒక్కటే! అందుకే తోటి ప్రాణులను దయగా చూడమంటారు. అలా చూసినవాడు బ్రహ్మ లోకాన్ని సులువుగా అందుకుంటున్నాడు. అని చెపుతూ భీష్ముడు జనన మరణాలకు సంబంధించి కీటకానికి, వేద వ్యాసులవారికి మధ్య జరిగిన సంవాదాన్ని ధర్మరాజుకి తెలియజేశారు.

ఒక రోజు వ్యాసుల వారు పయనిస్తున్న రథం పరుగు తీస్తుంది. అయితే ఆ దారిలో ఓ కీటకం రోడ్డు దాటుతూ రథాన్ని చూసి తొందరగా పరుగు తీస్తూ దాటే ప్రయత్నం చేస్తుంది. వేద వ్యాసుడు ఆ కీటకాన్ని గమనించాడు, రథం ఆపి అకీటకానికి మాట్లాడే శక్తిని ఇచ్చి, ఆ కీటకాన్ని ప్రశ్నించాడు… ఎందుకు అంత వేగంగా పరిగెడుతున్నావు? అని అడిగాడు.

అందుకు కీటకం కాస్త ఆగి ఏం చెప్పమంటావు మునీంద్రా! నీ రథ చక్రాల క్రిందపడి నలుగుతే నా ప్రాణం పోతుందికదా? అని అంది కీటకం. అప్పుడు వ్యాసులవారు ఇంత చిన్న కీటకానివి నీకు కూడా ప్రాణభయం వుందా? అని అడిగారు.

అప్పుడు ఆ కీటకం…మహాత్మా ఏ ప్రాణికైనా బ్రతుకంటే మహా సుఖం. చావంటే చెప్పలేనంత దుఃఖం. ఆ దుఃఖాన్ని నేను తట్టుకోలేను అంది. నాకు

చనిపోవడం ఇష్టం లేదు, అందుకే పరుగు తీస్తున్నాను. ప్రాణభీతికన్నా పరమ ఆందోళనకరం ఏమున్నది? అని వేద వ్యాసులతో అంది.

అప్పుడు ఆయన నీలాంటి జీవులకు కూడా ఇంద్రియ సుఖం ఉంటుందా? ఉన్నా అది ఏ మాత్రం? నువ్వు బ్రతికి ప్రయోజనం ఏముంది? అని అడిగాడు వ్యాసుడు.

అప్పుడు ఆ కీటకం అదేమిటి మౌని అంత మాట అన్నారు. పురుగులకు ఇంద్రియ సుఖం లేదన్నట్టుగా మాట్లాడుతున్నారేమిటి. మాకు మా స్థాయిని బట్టి ఇంద్రియ సుఖాలు ఉన్నాయి. మాకు నచ్చింది తిని మేము అందిస్తున్నాము, నచ్చింది చూస్తున్నాము, మాకు సంతానం కలుగుతుంది. అవన్నీ మేము అనుభవిస్తున్నాము కాబట్టే చావంటే భయపడుతున్నాము అన్నది కీటకం.

భీష్ముడు ఈ విషయం చెపుతూ ... అందుచేత ఏజీవిని చంపకూడదు, హింస చేయకూడదు, అహింసను పాటించాలి. అహింసే అన్నిటికన్నా అత్యుత్తమమైనదని బృహస్పతులవారు చెప్పడం జరిగిందని భీష్ములవారు చెప్పడం జరిగింది.

# కర్మలు ఎలా దగ్ధం చేసుకోవాలి?

మానవులందరూ  సుఖంగా, సంతోషంగా జీవించాలని ప్రయత్నిస్తూ ఉంటారు. కొందరు సంతోషంగా వుంటారు. కానీ మరి కొందరు దుఃఖంలోనూ, బాధల్లోనూ ఉంటున్నారు. దానికి వారు చేసుకున్నటువంటి కర్మలే కారణం.

మానవ జన్మ ఎంతో గొప్పది అని చెప్తారు. అంతేకాదు మానవ జన్మ రావడమే దుర్లభం అని చెబుతారు. ఎందుకో ఇప్పుడు మనం తెలుసుకుందాం.

ఈ జన్మలు మూడు రకాలు.

1) దేవజన్మ, 2) జంతు జన్మ, 3) మానవ జన్మ

ఎక్కువ పుణ్యం చేస్తే దేవజన్మ, ఎక్కువ పాపం చేస్తే జంతు జన్మ, పాపాలు, పుణ్యాలు రెండు కలిపి చేస్తే మానవ జన్మ వస్తుంది అని చెప్తారు. మరి ఈ మానవ జన్మ గొప్పది ఎలా అయింది అంటే?

దేవ జన్మ తీసుకుంటే అక్కడ స్థూల శరీరం ఉండదు. అందుచేత మళ్లీ పరమాత్మ గురించి చేయాల్సిన సాధన గాని, సేవలు కానీ చేయడానికి వీలుకాదు. భోగం అనుభవించడమే కానీ పరమాత్మను పొందటానికి చేయవలసిన సాధనకు కావలసిన శరీరం అక్కడ ఉండదు. అందువల్ల  సుఖాలు భోగాలు అనుభవిస్తారే కానీ, అక్కడ సాధన చేసి ఇంకా గొప్పగా ఎదిగి, పరమాత్మని తెలుసుకునేంత స్థితిని పొందలేరు.

మరి జంతు జన్మ అంటే? ఈ జన్మ కూడా మోక్షం పొందడానికి గాని, పరమాత్మను తెలుసుకోవడానికి కానీ వీలు కానీ జన్మ. అంటే ఇక్కడ శరీరం ఉంటుంది కానీ బుద్ధి ఉండదు. కాబట్టి జంతు జన్మలో పరమాత్మను తెలుసుకోలేరు.

ఒక్క మానవ జన్మలోనే సాధనకు కావలసిన శరీరం, తెలివి, బుద్ధి అన్నీ ఉంటాయి. కాబట్టి మానవ జన్మే సరైన సాధన చేసి మోక్షాన్ని పొందే అర్హతకి అనువైన జన్మ. అందుకే మానవ జన్మ మహోన్నతమైనది, అద్భుతమైనది అంటారు. ఇటువంటి జన్మ లభించడం దుర్లభం అని కూడా అంటారు.

మరి ఈ మానవ జన్మ పొందాక కొన్ని జన్మలు తమో గుణంతో, కొన్ని జన్మలు రజోగుణంతో, కొన్ని జన్మలు సాత్విక గుణంతో ఉండి ఆ గుణాలకు అనుగుణంగా కర్మలు చేస్తూ ఉంటారు. పాప కర్మలు చేసేటప్పుడు బాగానే వుంటుంది కానీ ఆ కర్మఫలం అనుభవించేటప్పుడు తీరని దుఃఖం ఉంటుంది. మరి ఈ కర్మలు రెండు రకాలుగా విభజించారు. అవి ఏమిటంటే?

1) విషయ కర్మలు, 2) శ్రేయకర్మలు.

విషయకర్మలు తమోగుణంలో, రజోగుణంలో చేస్తారు. విషయాసక్తితో ప్రాపంచికానికి ప్రాముఖ్యం ఇస్తూ, ఈ కర్మలు చేస్తూ ఉంటారు. ఈ కర్మలు బంధాలను పెంచుతూ ఉంటాయి. ఆ బంధాలు మళ్ళీ జన్మకి కారణం అవుతాయి.

అలాగే ఆత్మ గురించి, ఆత్మోద్ధరణ గురించి చేసే కర్మల్ని శ్రేయోకర్మలు అంటారు. అంటే ఆత్మ గురించి చేసే ఏ కర్మ అయినా సరే బంధం నుంచి విముక్తుల్ని చేస్తుంది. కానీ ఎవరైనా జీవితంలో ఒక సద్గురువు వచ్చాక ఎలాంటి కర్మలు చేయాలో నేర్చుకుంటారు.

శ్రేయోకర్మలు చేస్తున్నంతసేపు ఆత్మ గురించి ఆలోచిస్తూనే ఉంటారు. అలాగే విషయకర్మలు చేస్తున్నంతసేపు ఆత్మని పట్టించుకోరు. ఇక్కడ ఎంత గొప్ప వారు కర్మలు చేసినా, ఎవరు చేసినా భగవంతుని కర్మ సిద్ధాంతం వర్తిస్తుంది. అందుచేత కర్మను బట్టి కర్మ ఫలాలు వస్తాయని తెలుసుకోవాలి. దాంట్లో మినహాయింపు వుండదు.

మరి ఈ బంధాలవల్ల కొన్ని కర్మలు అంటించుకుంటూ, జన్మజన్మలకు అవి మోస్తూ సుఖపడుతూ, దుఃఖపడుతూ ఉంటారు. ఈ శరీరం కర్మను బట్టే వచ్చింది. పాపమైనా, పుణ్యమైన శరీరం వస్తుంది. కానీ సద్గురువు వచ్చాక ఎలాంటి కర్మలు చేయాలో ప్రతి ఒక్కరు నేర్చుకుంటారు. ఎందుకంటే సద్గురువు ఒక్కడే సత్యం చెప్పగలడు. సత్యం చెప్పిన వాడే జన్మని ఎలా సార్ధకత చేసుకోవాలో చెప్పగలుగుతాడు.

కాని అప్పటివరకు డబ్బులో సుఖముంది, భార్యా లేదా భర్త వల్ల

సుఖముంది, పిల్లల వల్ల సుఖం ఉంది అని ప్రతి వాళ్లు కూడా సంసారం కోసం, ధనం కోసం తాపత్రయ పడుతూ ఉంటారు.

కానీ ఆధ్యాత్మిక మార్గంలోకి వచ్చేవరకు కూడా శాశ్వతమైనది ఏంటి? అశాశ్వతమైనది ఏంటో కూడా తెలియదు. కానీ ఈ మార్గంలోకి వచ్చిన తరువాత ఈ సృష్టిలో సృష్టించబడినవన్నీ కూడా అశాశ్వతమే, శాశ్వతమైనది ఆత్మ ఒక్కటే అని తెలుసుకుంటారు. అప్పుడు శ్రేయోకర్మలు ఎక్కువ చేస్తూ ఉంటారు. ఏదైనా సరే కర్మ అనేది అంటుకోకుండా ఉండాలంటే ఏం చేయాలి అనేది ముందుగా తెలుసుకోవాలి .

కర్మలు 3 రకాలు. ప్రస్తుతం చేస్తున్న కర్మలు ఆగామి కర్మలు. మీ ఖాతాలో వున్న కర్మలు సంచిత కర్మలు అంటారు. అలాగే అందులోంచి తెచ్చు కున్న కర్మలు ప్రారబ్ధ కర్మలు అంటారు. ఈ ప్రారబ్ధాన్ని ఎవ్వరూ తప్పించుకోలేరు.

**1) ఆగామి కర్మలు :**

ఈ శరీరం తీసుకున్నాక చేసే కర్మలు ఆగామి కర్మలు. ఇప్పుడు చేస్తున్నాము కాబట్టి ఇవి మన భవిష్యత్తుకు లాభం కలిగించేవిగా ఉండేటట్టు చూసుకోవాలి. అందుచేత మనం చేసే ప్రతి కర్మ లోక కళ్యాణ కరంగా వుండాలి.

ఈ ఆధ్యాత్మిక మార్గంలోకి వచ్చాక ఎలాంటి కర్మలు చేయాలి? కర్మ చేసేటప్పుడు ఎలాంటి భావంతో చేయాలి? అన్నది తెలుసుకుందాం.

ఇంతకు ముందు జన్మల్లో ఎలా చేశాము అన్నది కాదు. ప్రస్తుత వర్తమానంలో మనం చేస్తున్న కర్మలు ఎలాంటి భావంతో చేయాలి అన్నదే ముఖ్యం. ముఖ్యంగా కతృత్వభావం లేకుండా చేయాలి. అంటే నేను చేస్తున్నాను అని కాకుండా నా చేత చేయించ బడుతుంది అని అనుకోవాలి.

ఇప్పుడు ఒక మాట మాట్లాడినా, ఒక పని చేసినా శరీరంలో ఆత్మ వుంది కాబట్టే చేయగలుగుతున్నారు. అలా ధ్యాన సాధన చేసినా, క్లాసులు చెప్పినా ప్రతిదీ శరీరంలో ఆత్మ వుంది కాబట్టి చేయగలుగుతున్నాను. ఆ అత్మే భగవంతుడు కాబట్టి, భగవంతుడి వల్లే ఈ పని జరుగుతుంది అని భావించాలి.

ఇప్పుడు పెద్ద యజ్ఞం చేసారు. నేను చేస్తున్నాను అనుకుంటే పుణ్యం వస్తుంది. అది లోక కళ్యాణం కోసం చేస్తున్న మహాయజ్ఞం అనుకుంటే అది బంధం అవ్వదు, నీ సంచితంలో కలవదు.

అలాగని పాపం చేయకూడదు. పాపం నీ స్వార్థం కోసం చేస్తున్నావు. చూడండి నీ స్వార్థం కోసం ఎవరినైనా చంపితే అది పాపం. కానీ యుద్ధంలో దేశాన్ని రక్షించడానికి చంపితే అది పాపం కాదు. ఎందుకంటే? దేశప్రజలు సుఖశాంతులతో ఉండాలనే ఉద్దేశ్యంతో చేశారు కాబట్టే.

మరి ధర్మరాజు చేత అబద్ధం ఆడించాడు కృష్ణుడు. మరి ఆ పాపం ధర్మరాజుకు రాదు. కారణం ధర్మస్థాపన కోసం చేశాడు కాబట్టి. అందుకే కామ్యకర్మలు కాదు, కర్తవ్య కర్మలు చేయాలి అంటారు. కామ్యకర్మలు అంటే ఫలితాన్ని ఆశించి చేసే కర్మలు. కానీ కర్తవ్య కర్మలు అంటే అక్కడ నీ కర్తవ్యం కోసం చేసిన కర్మ. శ్రీ కృష్ణుడు యుద్ధం చేయించాడు అంటే దుష్ట శిక్షణ జరగాలి, ధర్మ స్థాపన జరగాలి కాబట్టి.

ఇక్కడ ధ్యానం చేస్తున్నావు అంటే అది నీ ప్రణాళికలో భగం. జ్ఞానం పొందడం కూడా నీ ప్రణాళికే. ధ్యానాన్ని, జ్ఞానాన్ని అందరికీ చెప్పడం అన్నది కూడా నీ ప్రణాళికే. ఇదంతా నా ప్రణాళికలో భాగం కాబట్టే నేను చేస్తున్నాను అనే భావంతో చేయాలి. అప్పుడు కర్మఫలం నీకు అంటుకోదు.

అందుకే ఆగామి కర్మలు జన్మకి కారణం కాకుండా, సంచితాల్లో కలవకుండా ఉండాలి. అందుకే శ్రీ కృష్ణుల వారు నిరంతరం కర్మని చెయ్యి, కాని కర్మఫలాన్ని త్యాగం చేయ్యమని చెప్పడం జరిగింది.

ఎందుకంటే? మోక్షానికి వెళ్ళాలి. అంటే పాపము ఉండకూడదు, పుణ్యము ఉండకూడదు. ఏది అంటించుకోకుండా నిస్సంగుడిగా ఉండాలి.

లోకంలో ఎంతసేపూ ఈ మేనుకి ప్రాముఖ్యం ఇచ్చి నేను కాబట్టి చేస్తున్నాను, చెప్తున్నాను, వింటున్నాను అని అనుకుంటూ ఉంటే అవి కామ్యకర్మలు అవుతాయి. ఆ కామ్య కర్మలే బంధమై జన్మకి కారణం అవుతాయి.

ఏ మానవుడైనా దుఃఖాన్ని భరించలేక ఇక ఈ జీవితం వద్దు

అనుకున్నప్పుడు  గురువు వస్తాడు.  అప్పుడు ఆ గురువే చెప్తాడు కర్మ ఎలా చేయాలి? ఎలా చేస్తే ఫలితం నీకు అంటుకోదు అన్నది. అందుచేత ఎవరైనా దుఃఖం నుంచి బయటపడాలంటే? ముఖ్యంగా గుర్తు వుంచుకోవలసింది, నేను గురువు దగ్గర నేర్చుకున్నాను, నేను చేయవలసింది  విషయకర్మలు కాదు, కామ్యకర్మలు కాదు... కర్తవ్య కర్మలు, శ్రేయోకర్మలే చెయ్యాలి అని.

అందుకే కత్రుత్వం లేకుండా,  లోక కళ్యాణం కోసం చేసే ప్రతీ కర్మ కర్తవ్యకర్మే, శ్రేయోకర్మే.  ఆలా శ్రేయోకర్మలు చేసినప్పుడు నీకు ఆగామి కర్మలు అంటే ఇప్పుడు ఈ జన్మలో చేసే కర్మలు ఏవి కూడా సంచితాల్లో కలవవు.

అసలు ధ్యాన సాధన ఎందుకు? అంటే మీ ఇంద్రియాల మీద మీకు పట్టు రావడం కోసం. మీరు చూడకూడదు అనుకుంటే చూడకూడదు, వినకూడదు అనుకుంటే వినకూడదు, మాట్లాడకూడదు అనుకుంటే మాట్లాడకూడదు. దానినే ఇంద్రియ నిగ్రహం అంటారు.

అందుకే ఎలాంటి కర్మలు చేయాలి. చేస్తూ ఎలాంటి భావంతో చేయాలి అనేది గురువులు వల్ల తెలుసుకోగలుగుతాం. ఇలా తెలుసుకుని చేసే కర్మ మీకు బంధం అవ్వదు, జన్మకి కారణం అవ్వదు. అంతేకాదు గురువు నుంచి నేర్చుకుని జ్ఞానం పెంచుకున్నప్పుడు ఆ జ్ఞానాన్ని ఎదుటివారికి ఇవ్వాలి. ఆధ్యాత్మికత అంటే వచ్చింది ఎదుటివాడికి ఇవ్వడమే. అదే మన ఎదుగుదలకి కారణమవుతుంది.

**2) ప్రారబ్ధ కర్మలు:** శరీరం తీసుకున్న తరువాత అనుభవించవలసిన కర్మల్ని ప్రారబ్ధకర్మలు అంటారు. అంటే ప్రస్తుతం ఏకర్మలైతే  అనుభవిస్తున్నారో అవన్నీ నిర్ణయించుకుని భూమి మీదకి వచ్చారు.   ఈ ప్రారబ్ధాలు తప్పకుండా అనుభవించాలి. జీవితంలో సంతోషం కానీ, దుఃఖం కానీ, ఆనందం కానీ, కీర్తి కానీ, అపకీర్తి కానీ, చావు కానీ, పుట్టుక కానీ, ఇవన్నీ కూడా  ప్రారబ్ధం వల్లే వస్తాయి.

మరి రామాయణంలో భరతుడు తండ్రి దశరథుడు చనిపోయాక, రాముడు అరణ్యవాసానికి వెళ్లాక వచ్చినప్పుడు చాలా దుఃఖపడ్డాడట. ఎంతో

దుఃఖం వచ్చిందట. తాను లేకుండా ఇవన్నీ జరిగాయని. కులగురువైన వశిష్టుల వారి దగ్గరికి వెళ్లి గురువుగారు నేను ఈ దుఃఖాన్ని భరించలేకపోతున్నాను, ఈ దుఃఖం పోదా? నేనేమి చేయాలి? అని అడిగినప్పుడు వశిష్టుల వారు ఇలా చెప్పారట. నాయనా సంతోషం కానీ – దుఃఖం కానీ, చావు కానీ – పుట్టుక కానీ, కీర్తి కానీ – అపకీర్తి కానీ, ఇవన్నీ కూడా ప్రారబ్ధానుసారమే వస్తాయి. అందుచేత ఇవన్నీ ప్రారబ్ధానుసారం వచ్చినవే. నువ్వు దేన్నీ మార్చలేవు. జరగాల్సింది జరుగుతూనే ఉంటుంది అని చెప్పారట.

అందుచేత ప్రారబ్ధం గురించి వశిష్టుల వారు చెప్పినవన్నీ రామాయణంలో ఎలా జరిగాయో చూద్దాం.

శబరి రాముడ్ని చూడాలి అనుకుంది. మరి చూసిందా? లేదా? శబరి పరమాత్ముని చూడాలి అంటే? ఆవిడ గురువుగారు పరమాత్మ రాముడి రూపంలో వస్తాడని చెప్పారట. మరి శ్రీరాముడు వచ్చాడు, శబరి చక్కగా చూసి, ఎంతో సంతోషించింది. ఈ సంతోషం ఆవిడకి ప్రారబ్ధం వల్ల వచ్చిందే.

మరి అలాగే కౌసల్య బిడ్డలు లేనన్నాళ్లు బాధపడింది. కానీ రాముడు పుట్టాడు. ఆ పుట్టిన బిడ్డ తెల్లవారితే చక్రవర్తి అవుతాడు అనుకుంది. కానీ అడవికి వెళ్ళాడు, భర్తని కోల్పోయింది. చూస్తే ఒక పక్క భర్తని కోల్పోయింది. మరో పక్క బిడ్డ అడవికి వెళ్ళాడు. అంతులేని దుఃఖానికి లోనయ్యింది ఆవిడ. ంతా ప్రారబ్ధమే!

రాముడు అడవికి వెళ్ళాడనే వార్త విని దశరథుడు మరణించాడు. ఆ మరణము ప్రారబ్ధమే.

మరి అహల్యకి శాప విమోచనం కలిగింది, మరో జన్మ కలిగింది అదీ ప్రారబ్ధమే.

మరి ఎంతోమంది రామ కార్యంలో అంటే రామరావణ యుద్ధంలో రాముడికి సహాయం పడ్డారు. కానీ కీర్తి అంతా ఆంజనేయునికి వచ్చింది అదీ ప్రార్ధమే.

మరి కైకేయి ఎంతో అల్లారు ముద్దుగా రాముడ్ని పెంచింది. కానీ

రాముడు అడవికి వెళ్లడానికి  కైకేయే కారణమయ్యింది, అపకీర్తి పాలయ్యింది. అదీ ప్రారబ్ధమే.

ఇలా చూసుకుంటే ప్రతి వాళ్ళ జీవితంలోనూ జరుగుతూ ఉంటాయి. రామాయణం ప్రారబ్ధం ఇలా ఉంటుంది అని మనకు నేర్పింది. మన జీవితంలో కూడా ప్రారబ్ధం ఉంటూనే ఉంటుంది.  కానీ సాధన అనేది మన దగ్గర వున్నప్పుడు. ఇది నేను తెచ్చుకున్న ప్రారబ్ధమే జరుగుతుంది అని అనుకుంటూ సాధన చేస్తూ దాన్ని ఓర్చుకుంటే ఆ ప్రార్ధాన్ని కూడా దాటివేస్తాం.

**3) సంచిత కర్మలు:** ఈ సంచితకర్మలు పెంచుకోకుండా ఉంటే జన్మలు తగ్గుతూ ఉంటాయి..  కానీ వందల జన్మలు తీసుకున్న మనం ఎన్నో సంచిత కర్మలు మూటలు, మూటలుగా పోగేసుకున్నాం. మరి ఈ సంచితకర్మలు దగ్ధం చేసుకోవాలి అంటే?

గీతలో కృష్ణ భగవానుడు చెప్పాడు “ జ్ఞానాగ్ని దగ్ద కర్మాణం” అని. అంటే జ్ఞానం పెరిగే కొద్దీ కర్మలు దగ్ధం అవుతాయి. అయితే ఏ జ్ఞానం మనకి కలగాలి? అంటే స్వరూప జ్ఞానం.  అంటే మన స్వరూపం తెలుసుకోవడమే!

నీ స్వరూపం అంటే? శరీరమా? మనసా? బుద్ధా? ఆత్మా? కానీ ఆత్మే నీవు. కానీ ఇప్పటిదాకా ఇవేవీ తెలుసుకోకుండా జీవించాం. అంటే మనకి ధ్యానం లోకి వచ్చే వరకు కూడా మనం ఎవరమో మనకు తెలీదు. కానీ ఈ శరీరము, మనసు, బుద్ధి అన్నీ కూడా ఆత్మను బట్టి వచ్చాయి. కాని ఈ కనబడుతున్న శరీరమే నేను అనుకుంటూ అజ్ఞానంలో ఉండిపోయాం. దీనికి మహాత్ములు చిన్న ఉదాహరణ చెప్పారు.

ఏమిటంటే ఒక సింహం ప్రసవించి మరణించిందంట. ఆ సింహం పిల్లని ఒక గొర్రెల కాపరి తీసుకెళ్లి పెంచుతాడట. అది ఆ గొర్రెల్లో కలిసిపోయి పెరిగి, తాను కూడా గొర్రెనే అనుకుందట.

ఆలా ఆ గొర్రెపిల్లలతో ఈ సింహం పిల్ల వున్నపుడు, ఒకసారి ఒక సింహం వచ్చిందట, అప్పుడు దాన్ని చూసి ఈ గొర్రెపిల్లలన్నీ  భయపడి పారిపోతుంటే! ఈ సింహం పిల్లకూడా భయపడి పారిపోయిందట. అప్పుడు

సింహం ఆ సింహం పిల్ల దగ్గరికి వెళ్లి ఇదేంటి నువ్వు సింహానివి కదా మరి నన్ను చూసి పారిపోతున్నావేంటి? అంటే కాదు నేను గొర్రె పిల్లని అందట. అప్పుడు ఆ గొర్రె పిల్లని ఒక చెరువు దగ్గరికి తీసుకెళ్లి చూడు నువ్వు నేను ఒకేలా ఉన్నాము అని గాండ్రించి. నువ్వు కూడా గాండ్రించగలవు గాండ్రించు అంటే అప్పుడు అది గాండ్రిస్తుందట. అప్పుడు ఆ సింహం పిల్లకి అర్థమయిందట అవును నేను గొర్రె పిల్లను కాదు, నేను సింహాన్ని అని. అప్పుడు సింహం వెనకాల అడవిలోకి పరిగెత్తిందట.

అలాగే నేను జీవుడనే అని ఈ శరీరాన్ని చూసుకుంటూ... మనసు బుద్ధి స్థితిలో ఉన్నప్పుడు ఈ శరీరం నేను అనుకుంటున్నాం. కానీ సద్గురువు లాంటి సింహం వచ్చినప్పుడు మన స్వరూపాన్ని తెలుసుకుంటాం, నేను ఆత్మని అని తెలుసుకుంటాం. కానీ శరీరం నేను  అన్నట్టుగా జీవిస్తే కర్మలు దగ్ధం కావు.

శరీరం నేను అనే అజ్ఞానంలో బ్రతికి నంతకాలం కర్మలు పెంచుకుంటూ ఉంటాం, బంధాలు పెంచుకుంటాం. మళ్ళీ ఈ బంధాల కోసం కర్మలు చేస్తూనే ఉంటాం. మరి ఈ బంధాలన్నీ పోగొట్టుకోవడం, కర్మ చేయకుండా ఆపగలగడం అన్నది గురువు వచ్చి మన స్వరూపాన్ని తెలియజేసినప్పుడు మాత్రమే సాధ్యమవుతుంది. అలాగే ఉన్న కర్మలు ఎలా దగ్ధం చేసుకోవాలో కూడా తెలుసుకుంటాం.

అందుకే గురువు లభించే వరకు సాధన, జ్ఞానం మనకి తెలీదు. ఆలా అజ్ఞానంతో  కర్మలు పెంచుకుంటూ ఉంటాం. జ్ఞానం వచ్చాక కర్మలు తగ్గించుకుంటూ వెళ్తాం. ఈ కర్మలు తగ్గించుకునే మార్గం ఒక్క ధ్యాన సాధనలోనే ఉంది, అంతేకానీ ఇంక వేరే ఏమీచేసినా కర్మలు  పోవు.

అందుచేత ధ్యానసాధన పెంచుకుని,  జ్ఞానం అన్నది  రోజూ కొద్దికొద్దిగా పెంచుకున్నప్పుడు,  సంచితాల్ని కూడా దగ్ధం చేసుకుంటాం. అలాగే మన స్వరూపాన్ని అంటే ఆత్మను దర్శించినప్పుడు, నేను ఆత్మనే కానీ శరీరం కాదు అనే ఖచ్చితమైన అభిప్రాయానికి వస్తే ఇంక కర్మే ఉండదు.

అంతేకాని "జ్ఞానాగ్ని దగ్ధ కర్మాణం" అని అంటే కర్మలు పోవు, వింటే పోవు.

అంతేకాదు ఆత్మగురించి తెలుసుకునేది అంతా జ్ఞానమే! చూడు నువ్వు మెలకువగా ఉన్నప్పుడు అజ్ఞానావస్థ అంటారు, నిద్రలో కలలు కంటున్నపుడు స్వప్నావస్థ అంటారు, గాఢ నిద్రలో ఉన్నప్పుడు సుషుప్తి అంటారు. కానీ ఆత్మకి ఈ మూడు అవస్థలు లేవు. ఆత్మ ఎప్పుడూ నిద్రపోదు, కలలు కనదు, గాఢ నిద్రపోదు. ఆత్మ సాక్షిగా ఉంటుంది. ఆత్మ కర్మలు చేయడానికి శక్తినిస్తుంది కానీ, తానుగా ఏదీ చేయదు.

అందుకే ఆత్మకు ఏ కర్మ అంటదు. కానీ ఈ శరీరంతో చేసిన కర్మలు, మళ్లీ శరీరాన్ని తెచ్చుకుని అనుభవించాలి. ప్రాపంచిక జీవితంలో తెలియక చాలా తప్పులు చేస్తూ ఉంటారు. కానీ ఆధ్యాత్మిక జీవితంలోకి వచ్చిన తరువాత కర్మ సిద్ధాంతం గురించి అవగాహన చేసుకుని చేసే ప్రతీ కర్మ గురించి ఆలోచించడమే కాదు, ఎలాంటి కర్మలు చేయాలో కూడా తెలుసుకుంటారు.

అందుకే మునులెప్పుడూ మౌనంగా ఉంటారు. కారణం మౌనం వల్ల శక్తిని కోల్పోరు, అంతేకాదు మాటద్వారా చేసే ఎన్నో కర్మల్ని చేయకుండా వుంటారు.

చూడండి ఎండు కట్టెల గుట్ట ఒక చిన్న అగ్గిపుల్ల గీస్తే కట్టలన్నీ కాలిపోతాయి. అలాగే వందల జన్మలలో చేసిన కర్మలన్నీ జ్ఞానమనే అగ్నిలో దగ్ధమవుతాయి. అందుకే మేధస్సుని, బుద్ధిని పెంచుకుంటే జ్ఞానం పెరుగుతూ ఉంటుంది. అందుకే సద్గురువు బుద్ధి వికసింప చేసుకోండి, బుద్ధి శుద్ధమయ్యేకొద్ది, చేసే పనులన్నీ కరెక్ట్ గా చేస్తారు అంటారు. అప్పుడు ఏది చేయాలో – ఏది చేయకూడదో, ఏది మాట్లాడాలో – ఏది మాట్లాడకూడదో తెలుస్తుంది అంటారు.

ఆలా ఈ మూడు రకాల కర్మలు పోగొట్టుకుని యోగిగా మారాలి. అందుకే మనమంతా ఇంత సాధన చేస్తున్నాం, జ్ఞానం పొందుతున్నాం.

# అహంకారాన్ని, మమకారాన్ని ఎలా పోగొట్టుకోవాలి

జీవితంలో ఎవరైనా అహంకార, మమకారాల్ని తొలగించుకునే ప్రయత్నం చెయ్యాలి. ఎందుచేతనంటే అవి మానవులకు ఎంతో నష్టాన్ని, కష్టాల్ని కలగజేస్తాయి.

మానవుడు ప్రశాంతమైన మనసుతోనే ఏదైనా  సాధించగలడు, ఆలోచించగలడు.  కానీ ఆ ప్రశాంతత మనిషి ఎందుకు కోల్పోతున్నాడు? అంటే ప్రతీదాని మీద మమకారం వుండడం వల్ల. సహజంగా ఈ మమకారం అన్నది పిల్లల మీద, భార్య మీద, భర్త మీద లేకపోతే ధనం మీద ఎక్కువగా వుంటుంది.

ఈ మమకారం మితిమీరి ఉన్నప్పుడు అవి ఎక్కడ చేజారిపోతాయో అని  ఆందోళన పడుతూ ఉంటారు. అలా ఆందోళనలో  వున్నవారు ధ్యానం చేయలేరు. కానీ ధ్యాన జీవితంలోకి వచ్చాక ప్రతీ విషయాన్ని తెలుసుకున్నప్పుడు మనకి అవన్నీ తగ్గుతాయి.

ముందు గురువు వల్ల ఏం నేర్చుకుంటామంటే 'నేను శరీరం కాదు నేను ఆత్మని' అని తెలుసుకుంటారు. ప్రాపంచికంలో ఉన్నపుడు ఈ శరీరమే నేను అన్నట్టుగా బతుకుతారు. ఈ ప్రపంచంలో  ఉన్నవన్నీ శాశ్వతం అనుకుంటారు. అలా అనుకుని వాటిమీద మమకారం పెంచుకుని తరువాత అవి పొందలేదని, అవి పోతాయని ఆందోళనలు, అలజడులు మొదలు అవుతాయి, మనశ్శాంతి కోల్పోతారు.

అటువంటి మనసును ప్రశాంతంగా ఉంచుకోవడానికే బుద్ధుడు "ఆనాపానసతి" ధ్యానం చెప్పాడు.

అంతేకాదు ప్రతి మానవుడికి అష్ట మదాలు ఉంటాయని బ్రహ్మర్షి వశిష్టుల వారు యోగవాశిష్టంలో చెప్పడం జరిగింది.  ఈ అష్ట మదాలలో ప్రతివాడికి ఏదో ఒక మదం ఖచ్చితంగా ఉంటుంది.  మదం అంటే అహంకారం, గర్వం అని అర్థం.

ఏ మనిషికైనా అహంకారం అన్నది ఉండకూడదు అని ఉపనిషత్తులలో చెప్పబడింది. కారణం అహంకారం ఉంటే ఆత్మజ్ఞానిగా ఎదగలేడు కాబట్టి.

శరీరం నేను అనుకునే వాడికి, అహంకారం తప్పకుండా ఉంటుంది. ఆత్మ నేను అని తెలుసుకునే వరకు అహంకారాలు ఉంటాయి.

అష్టమదాలు వున్నవారికి అహంకారం ఉంటుంది. అష్ట మదాలు అంటే?

1. కులమదం.
2. ధనమదం.
3. విద్యామదం.
4. రూపమదం.
5. అధికారమదం.
6. ఆస్తిపాస్తుల మీద మదం.
7. ఈషణాత్రయం.
8. ఆశ్రిత జనపక్షపాతం.

**1.కులమదం:-** అంటే నేను పెద్ద కులంలో పుట్టాను అనే అహంకారం.

**2.ధనమదం:-** అంటే నేను బాగా సంపాదిస్తున్నాననే అహంకారం.

**3.విద్యామదం:-** నేను బాగా చదువుతున్నాను అనే అహంకారం.

ఈ ప్రాపంచిక విద్యలలో డిగ్రీలు చూసుకుని, నేను ఇంత చదువుకున్నాను, నేను లాయర్ని, నేను డాక్టర్ని, నేను ఇంజనీర్ని, నేను గొప్పవాడిని అనే మదం వస్తుంది. అందుచేత ప్రాపంచిక చదువులన్నీ అహంకారాన్ని పెంచితే! ఆధ్యాత్మిక విద్య అంటే ఆత్మవిద్య వినయాన్ని నేర్పుతుంది. ప్రాపంచిక విద్యలో నేను చదువుతూన్నాను అనుకుంటారు. కానీ ఈ ఆధ్యాత్మిక విద్యలో అంతా ఒక్కటే అని తెలుసుకుంటారు కాబట్టి వినయం వస్తుంది. ఇది తెలియకపోతే అహంకారమే!

**4.రూపమదం:-** నేను అందగత్తెను, అందగాడిని అనే అహంకారం..

**5.అధికార మదం:-** నాకు పదవి వుంది అని, నేను "CM" అని, నేను మినిస్టర్ అనే అహంకారం.

**6. ఆస్తిపాస్తులు :-** ధనము, సంపదలు వల్ల వచ్చే అహంకారం..

**7. ఈషణాత్రయం:-** ధనంమీద, భార్యమీద/ భర్తమీద, పిల్లలమీద మమకారం.

**8. ఆశ్రితజనపక్షపాతం:-** నన్ను ఇంతమంది ఆశ్రయిస్తున్నారు, నేను ఇంతమందికి సేవ చేస్తున్నాను అన్న అహంకారం.

వీటిని అష్టమదాలు అంటారు.

ఇవన్నీ ఒకళ్ళకే ఉండకపోయినా, ఇందులో ఏదో ఒకటి అహాన్ని పెంచుతూ ఉంటుంది. ఇవన్నీ పోవాలంటే 'శ్వాస మీద ధ్యాస' పెట్టి తీవ్ర ధ్యాన సాధన చేస్తే మెల్లిగా మనసు శూన్యం అవుతుంది. అహానికి కారణం మనసే. మనసే లేకపోతే ఇక అహం ఎక్కడ ఉంటుంది ?

పత్రిగారు ఏమి చెప్పారంటే? పోగొట్టుకోవాల్సినవి పోగొట్టుకుంటే పొందవలసింది పొందుతారు అని. అంటే ప్రపంచం శాశ్వతం అనే అభిప్రాయాన్ని, శరీరం నేను, మనసే నేను అనే అభిప్రాయాన్ని పోగొట్టుకుంటే మిగిలేది ఆత్మ. ఆ ఆత్మే నీవు అయి ఉన్నావు అని తెలుసుకోగలిగితే మెల్లిమెల్లిగా అహంకారం తగ్గుతూ వుంటుంది.

అంతేకాదు ఏదో ఒక రోజు నాకు వృద్ధాప్యం వస్తుంది. దాన్నుంచి నేను తప్పించుకోలేను అని తెలుసుకుని ఆ విషయాన్ని అనుక్షణం గుర్తు ఉంచుకుంటే నేను యవ్వనవంతుణ్ణి, అనే అహంకారం పోగొట్టుకుంటావు.

ఈరోజు నీవు యవ్వనంలో ఉండవచ్చు, కానీ కొన్ని రోజుల తర్వాత వృద్ధాప్యం వచ్చినప్పుడు ఏమీ చేయలేకపోవచ్చు. అందుచేత వృద్ధాప్యంలో ఉ వున్న వాళ్ళని ఎప్పుడూ హేళనగా చూడకూడదు. నేను యవ్వనంలో వున్నాను అని అహంకారం పొందకు. ఎందుకంటే ప్రతి ఒక్కరికీ బాల్యము, యవ్వనము, కౌమారం, వృద్ధాప్యము అన్నవి తప్పని సరి అని తెలుసుకోవాలి.

వృద్ధాప్యం సహజమని నీకు అనిపించినప్పుడు 1. నీలో అహంకారం వదులుకుంటావు. 2. యవ్వనంలో చేయవలసిన పనులు చేస్తావు అంటే యవ్వనంలో తీవ్ర ధ్యాన సాధన చేస్తావు.

అంతేకాదు యవ్వనంలో ఉన్నప్పుడే ఏదైనా సాధించగలం అని తెలుసు

కున్నప్పుడు ఎంత జ్ఞానం పొందాలో? ఎంత సాధన చేయాలో? ఎంత జ్ఞానప్రచారం చెయ్యాలో? అంతా చేస్తావు. తెలుసుకోవలసిన సత్యాన్ని తెలుసుకుంటావు.

అలాగే ఆరోగ్యంగా ఉన్నానని అనుకుంటావు కానీ ఏదో ఒక రోజు అనారోగ్యం కూడా రావచ్చు. అందుచేత ఆరోగ్యంగా ఉన్నానని అహంకరించకు. అహంకారం ఉంది అంటే రజోగుణంలో ఉన్నట్లే. రజోగుణంలో ఉన్నప్పుడు చాలా పాపకర్మలు చేస్తారు. పాపాలవల్ల కష్టాలు వస్తాయి.

"ఏదో ఒక రోజు నాకు మృత్యువు వస్తుంది" అని ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలి. జ్ఞాని ఎప్పటికైనా మృత్యువు నాకు వచ్చే తీరుతుంది అనే సత్యాన్ని గ్రహించగలుగుతాడు. ఆ మృత్యువు నా దగ్గరకు చేరే లోపల నేను ఏం చేయాలి అని ఆలోచిస్తాడు.

అంతేకాదు భూమిమీద ఉండేది కొద్దిరోజులే. కానీ నిజమైన ఆనందం పొందేది ఎప్పుడు అంటే? ఆత్మజ్ఞానం, బ్రహ్మజ్ఞానం పొంది ఈ లోకాలలోనే కాదు, ఊర్ధ్వలోకాలలో కూడా గొప్పగా బ్రతక గలిగినప్పుడు. అందుచేత ఎప్పుడో ఏదో చేస్తాను అంటే అప్పటివరకు మృత్యువు ఆగదు. అందుకే ఏదో ఒక రోజు మృత్యువు నిన్ను కబలించక ముందే సమయం వృథా చేయకుండా జ్ఞానాన్ని పొందాలి.

అలాగే నేను అమితంగా ప్రేమించేవి అన్నీ కూడా ఏదో ఒకరోజు నేను వదిలిపెట్టవలసిందే, లేదా అవైనా నన్ను వదిలిపోతాయి. ఇది అనుక్షణం జ్ఞాపకం ఉంచుకుంటే నావాళ్లు, నావాళ్లు అనుకునే వాళ్లమీద మమకారం పెంచుకోకుండా ఉంటాం. వారితో ఉంటాం కాని వారికి ఏదైనా అవుతే ఏడుస్తూ కూర్చోం. వారికి భర్తగా ఎంత చేయాలో అంత చేస్తాం, భార్యగా ఎంత చేయాలో అంత చేస్తాం, పిల్లలను కన్నాం కాబట్టి వాళ్లకు ఎంత చేయాలో అంత చేస్తాం. అంతే కానీ వారిమీద మమకారం పెంచుకోరు.

నాకింత మంచి సంసారం ఉందని అహంకారం పెంచుకోరు. ఎప్పుడైతే అహంకారాన్ని ప్రక్కన పెడతామో అప్పుడు మన మనసు సాధన వైపునకు

మళ్ళుతుంది. కానీ అవన్నీ చూస్తూ గర్వించినప్పుడు సాధనని ప్రక్కన పెట్టేస్తాం.

నేను ఈరోజు కష్టంలో ఉన్నా, సుఖంలో ఉన్నా నేను చేసిన పనుల వల్లే, నేను చేసిన కర్మల వల్లే నా జీవితం ఇలా ఉంది, ఇలా ఉండడానికి కారణం నేనే అని ఎవరికి వారు తెలుసుకోవాలి. అందుకే పత్రిగారు చెప్తారు **"నీ వాస్తవానికి నీవే సృష్టికర్తవి".** వర్తమానంలో నీవు కష్టాలను అనుభవించు, భోగాలను అనుభవించు, సుఖాలను అనుభవించు ఏది అనుభవిస్తున్న నీవు చేసుకొచ్చిన కర్మలే! అంటే నీవే కారణం.

ఈరోజు మనకు భోగాలు ఉన్నాయి, ఎంతో డబ్బు ఉంది, అంటే అది మన ప్రతాపం కాదు. మనం గత జన్మలో చేసిన పుణ్యకర్మల ఫలితమే ఈరోజు భోగాలు రావచ్చు. అలాగే కష్టాలు ఉంటాయి, ఎంత ధ్యానం చేస్తున్నా కష్టాలు పోవట్లేదు అంటే? నీవు గతజన్మలో చేసుకుని వచ్చావు. కాని దానికి తగ్గ సాధన చేస్తే అవి పోతాయి.

అహంకారం వలన నేనే సంపాదిస్తున్నాను అనుకుంటావు. మరి నీలాగే కష్టపడిన వారి అందరికీ సంపదలు ఉన్నాయా? లేవు మరి అలాంటప్పుడు నా వల్లే అనే అహంకారం ఎందుకు పొందుతున్నావు? అజ్ఞానం వల్లే.

అందుకే ప్రతి దానికి కూడా మనసే కారణం. అహంకారం పెంచుకోవడానికి మనసే కారణం, అహంకారం లేకుండా ఉండడానికి మనసే కారణం.

బుద్ధుడు ప్రాపంచిక జీవితంలో తృప్తిగా జీవించు, ఆధ్యాత్మిక జీవితంలో అసంతృప్తిగా జీవించు అన్నారు. అప్పుడు నీవు ఉన్నతంగా ఎదుగుతావు. మనకు తినడానికి ఎంత కావాలి? కట్టుకోవడానికి ఎంత కావాలి? వున్నది సరిపోతుంది కదా?

అందుచేత వున్న దానితో తృప్తితో బ్రతకాలి.

ఏదో ఒకరోజు వృద్ధాప్యం వస్తుందని, ఏదో ఒకరోజు అనారోగ్యం రావచ్చని, ఏదో ఒకరోజు మృత్యువు వస్తుందని, ఏదో ఒకరోజు నావి అనుకున్నవన్నీ నేను వదిలి వెళ్ళవలసి వస్తుంది అని, నేను చేసే పనుల వల్లే

నా జీవితం ఇలా ఉంది అని ఎప్పటికప్పుడు మనము అనుకోగలిగితే! మనస్సును ప్రశాంతంగా ఉంచుకుని సాధన చేస్తూ, మనసును ప్రశాంతంగా ఉంచుకొని చక్కని ఆత్మజ్ఞానం, బ్రహ్మజ్ఞానం పొందడానికి అవకాశం ఉంటుంది.

జ్ఞాని ఈ లోకంలోనే కాదు, పైలోకంలో కూడా గొప్పస్థితిలో ఉంటాడు. మరి అజ్ఞాని భూమి మీదా గొప్పగా ఉండలేడు, పైలోకాల్లోనూ ఉండలేడు.

అందుకే ఆత్మజ్ఞానానికి, బ్రహ్మజ్ఞానానికి మించినది ఈ సృష్టిలోనే ఏదీ లేదు; అంతకంటే ఆనందకరమైన జీవితం కూడా లేదు అని తెలుసుకోవాలి. ఇది తెలుసుకున్నవారు సత్యాన్ని ప్రేమిస్తారు, జ్ఞానులను ప్రేమిస్తారు, మహాత్ములను ప్రేమిస్తారు.

కానీ సత్యాన్ని అవగాహన చేసుకోవడం చాలా కష్టం. ప్రపంచం వైపు తిప్పిన మనసు సత్యాన్ని ప్రేమించలేదు. ప్రపంచం ఏమనుకుంటుందో అని బతికే వాడు ఇవి ఏవి గుర్తించరు. ప్రపంచం ఏమనుకున్నా పరవాలేదు పరమాత్మ మెచ్చితే చాలు అనుకున్న వాడే సత్యాన్ని ప్రేమిస్తాడు, సత్యం చెప్పేవారిని ప్రేమిస్తాడు, ఆ సత్యం చెప్పేవారి మాటలు జవదాటకుండా ఆచరణలో పెట్టుకుంటాడు. మరి ఈ విధంగా మనమందరం సత్యమార్గం వైపు పయనిస్తున్నాం.

మనలో అహంకారం తగ్గించుకోవాలి, మమకారం తగ్గించుకోవాలి, సాధన మీద దృష్టి పెట్టాలి, ఆత్మజ్ఞానం, బ్రహ్మజ్ఞానం పెంచుకోవడానికి కృషి చేయాలి.

అలా చేస్తేనే గొప్పగా జీవించగలం.

# సాధకుని యొక్క అవలక్షణాలు

చాలా మంది ధ్యాన సాధన చేస్తున్నారు, జ్ఞానం వింటున్నారు. సాధన అన్నది మనసుని శుద్ధంగా ఉంచడానికి, జ్ఞానం అన్నది వారి స్వస్తితి తెలుసుకోవడానికి ఉపయోగపడుతాయి.

అంటే నేను ఎవరు? ఎక్కడి నుండి వచ్చాను? ఈ భూమ్మీదకి ఎందుకు వచ్చాను? మరల ఎక్కడికి వెళతాను? మరి అలా వెళ్లడానికి చేసే ప్రయత్నంలో అడ్డంకి ఏమిటి? ఆ అడ్డంకులు ఎలా తొలగించుకోవాలి? ఇవన్నీ కూడా జ్ఞానం వల్ల మాత్రమే తెలుసుకుంటాము. జ్ఞానం తెలియకుండా ఒట్టి సాధనే చేస్తే, అంత తొందరగా ఎదగలేరు.

ఒక పక్షి పైకి ఎగరడానికి రెండు రెక్కలు అవసరము. అందులో ఏ రెక్క లేకపోయినా ఎగరలేదు. అలాగే భూమి మీదకి వచ్చి, జీవులమని అనుకుంటున్న వారు దేవుడిగా ఎదగాలి. దానికి "సాధన", "జ్ఞానము" రెండూ ఉండాలి.

మరి అందులో భాగంగానే మనమందరం కూడా రోజూ "సాధన చేస్తున్నాము", "జ్ఞానం వింటున్నాము". జ్ఞానం ఎన్నాళ్ళు వింటారు? అనే వాళ్లకి, మనము ఒకటే సమాధానం చెప్పాలి, గాలి ఎన్నాళ్లు పీలూస్తాం, బతికి ఉన్నన్నాళ్లు పీలుస్తాం. అలాగే జ్ఞానం ఎన్నాళ్ళు వినాలి? అంటే ఆ "పరమాత్మ దర్శనం" అయ్యేవరకు. పరమాత్మ దర్శనం ఇంకా కలగట్లేదు అంటే, సాధన, జ్ఞానము సరిపోవటం లేదు అని తెలుసుకోవాలి.

మరి ఈ జ్ఞానం పెరగక పోవడానికి కారణం ఏమిటి? వారికున్న అవలక్షణాలు ఏమిటి? కొద్దిగా తెలుసుకుందాము. అంటే జ్ఞానము విన్నంత మాత్రాన "అజ్ఞానము" పోదు. కానీ అజ్ఞానం పోయి జ్ఞానమే వస్తే, వారిలో "సర్వాత్మ భావన" వస్తుంది. "పరమాత్మ దర్శనం" కలుగుతుంది. అది కలగటం లేదంటే, ఇంకా వారిలో అజ్ఞానం వున్నట్లే. అంటే మనసు ప్రభావం ఉన్నట్టే.

అందుచేత ప్రపంచం వైపు వున్న మనస్సును ఆత్మవైపు తిప్పాలి. కానీ

మనసు పూర్తిగా ఆత్మవైపు తిరగకపోతే  కొన్ని అవలక్షణాలతో ఉంటుంది. ఆ అవలక్షణాలు ఏమిటి? దానివల్ల మనకి జరుగుతున్న నష్టం ఏమిటి? అన్నది ఈరోజు తెలుసుకుందాం.

అవలక్షణాలు వుంటే చేయకూడని పనులు చేస్తారు. ఆత్మజ్ఞానం పెరగదు. అందుచేత ముందు అవలక్షణాలు ఏమిటో తెలుసుకుందాం.

1. అసూయ.  2. అహంకారం, 3. అనుమానం, 4. అత్యాశ, 5. అజ్ఞానం

**1. అసూయ:-** ఈ అసూయ ఉండేవాడికి ఈర్ష్య ఎక్కువగా ఉంటుంది. ఇది మనసు యొక్క అవలక్షణం. ఆధ్యాత్మిక జీవితంలో ఎవరైనా కొంచెం ఎదిగినా, వారు పొందిన జ్ఞానం ఇతరులకు చెబుతున్నా "ఆ"  వాడి సొంతమా? ఏంటి? అందులో చూసి, ఇందులో చూసి చెప్తున్నాడు, అందులో చూసి, ఇందులో చూసి రాస్తున్నాడు అనుకుంటే వాడికి అసూయ ఉన్నట్టే.

మనం గమనిస్తే,  వేదాలు  దగ్గర నుంచి, ద్వాపర యుగం నుంచి ఎంతో జ్ఞానం లోకానికి ఇవ్వబడింది. ఈ కలియుగంలో మానవునకు,  జ్ఞానం మీద ఏ కొద్దిపాటి ఆసక్తి కలిగినా, వాడు చాలా గొప్ప వాడే.

కానీ, పుస్తక రూపంలో వచ్చిందంటే మనల్ని చదవమనే. చదివింది గ్రహించి, అర్థం చేసుకొని, ఆచరణలో పెట్టి అది ఇంకొకళ్ళకి చెప్పమనే. లేకపోతే లోకంలోని వారికి ఈ వేదజ్ఞానం ఎలా తెలుస్తుంది? ఎవరికైనా అసూయ ఎప్పుడు వస్తుందంటే? ఎవరైనా చేయలేని పని, వారికి నచ్చని వ్యక్తులు చేస్తే, ఏదో విధంగా విమర్శిస్తారు.

విమర్శించారు అంటే వారిలో ఏదో మూల అసూయ ఉన్నట్టే! ఈ అసూయ ఉన్నవాడికి సరైన నిద్ర ఉండదు. వారు ఎక్కువగా వాళ్లని, వీళ్ళని విమర్శిస్తూ వుంటారు.

పత్రిగారు ఏమంటారంటే? **"నో కామెంట్, నో జడ్జిమెంట్"** అంటారు. ఎందుకు అంటే? ఆ కామెంట్స్ మొదలుపెట్టిన దగ్గర నుండి వారిలో "అసూయ" పెరిగిపోతుంది. అందుచేత పెద్దలు చెప్పింది అచరించకపోతే నష్టపోయేది

వారే. ఆధ్యాత్మిక మార్గంలో ఏది తప్పు? ఏది ఒప్పు? అని చెప్పే సద్గురువులు ఉంటారు.

కాని, దుర్గుణాలకు బానిస అయినవారు అసూయ అనే గుణం ప్రదర్శిస్తారు. కాని అది వారి ఎదుగుదలకి పెద్ద అవరోధం అనే అవగాహన లేనప్పుడు, ఆ గుణాన్ని పెంచి పోషిస్తారు. ఒక్క విషయం గుర్తుంచుకోవాలి. ఈ సృష్టిలో జరుగుతున్నవన్నీ “పరమాత్మ” నిర్ణయం ప్రకారమే జరుగుతున్నాయని తెలుసుకోవాలి.

అందుకే మనసుకి ఉన్న దుర్గుణాలను మార్చుకోవాలి. ఎవరిని చూసి అసూయ పడకూడదు. ఎందుకంటే వాళ్ళ, వాళ్ళ ప్రయత్నాన్ని బట్టి, వారి టాలెంట్ ఉంటుంది.

కానీ వాళ్ళు నచ్చలేదని అందులో నుంచి చెడ్డని తీసుకుంటాము. ఈర్ష్య అక్కడ వచ్చేస్తోంది మనకి. దానివల్ల “అసూయ”లో పడిపోతున్నాము. ఇలా అసూయ ఉన్నవాడికి “సరియైన నిద్ర” ఉండదు. అంటే ఎవరికైనా దుర్గుణం వుంటే నష్టపోతారు అని తెలుసుకోవాలి.

ఎవరైతే ఈర్ష్య పడుతున్నారో, ఎవరైతే అసూయ పడుతున్నారో, వాళ్లకే నష్టం కలుగుతుంది. ఈ గుణం వల్ల, ఆధ్యాత్మికంగా ఎదగలేరని జ్ఞానం పొందితే అర్థమవుతుంది. అందుకే ధ్యానసాధన చేసే వాళ్ళకి “అసూయ” అన్నది ఉండకూడదు. మనమందరం ఆధ్యాత్మికంగా ఎదగాలనుకుంటున్నాము. అందుకే మనకి ఏ గుణం ఉంటే వెనక పడిపోతున్నామో? ఆ గుణాలన్నీ మార్చుకోవడానికి మనం ప్రయత్నించాలి.

**2. అహంకారం:-** అహంకారమంటే ‘నేనే’ అనే భావం. అందరికంటే నేనే గొప్పగా ఉండాలి అనే గుణం. ప్రతి వారిని తక్కువగా చూడటం, నాకంటే గొప్ప వాళ్ళు ఎవరూ లేరు అనుకోవడం, ఇవన్నీ అహంకారం.

ఎవరికైనా అర్థ బలం, అంగబలం ఎక్కువగా ఉంటే అహంకారం ఎక్కువవుతుంది. విద్యలో కానీ, డబ్బులో కానీ, పదవులలో కానీ, నేనే గొప్పవాడిని అనే భావం కూడా అహంకారాన్ని పెంచుతుంది.

ఎప్పుడైతే నేను గొప్పవాడిని అని అనుకుంటారో! ఆ అహంకారంతో ప్రక్క వాళ్ళని తక్కువగా చూస్తారు. అలాంటి వారికి సరైన మిత్రులు ఉండరు. అహంకారం వున్నవారు ఒకరు చెబితే వినరు. నాకంటే ఎక్కువ తెలుసా నీకు! అని అంటారు. అటువంటి వారికి మనస్ఫూర్తిగా ప్రేమించే వ్యక్తులు వుండరు. అందుకే వారు ఎదగలేరు. కానీ మంచి మిత్రులు ఉంటే మంచి సలహా దొరుకుతుంది.

పత్రిగారు అందరి దగ్గర నుండి నేర్చుకోవాలి అని ఎప్పుడూ చెప్తూనే వుంటారు. కానీ వారు నాకు చెప్పేది ఏంటి? నాకే అన్ని తెలుసు అనుకోవడం. "నేను" అన్ని చేయగలను అని అనుకోవటమే అహంకారం. పత్రిగారు ఇంకొక సందర్భంలో చెప్పారు, "నాకు తెలుసు", కానీ వాళ్ళకు కూడా తెలిసి వుండవచ్చు, ఏదైనా చెబుతారేమో! నాకు ఉపయోగ పడుతుందేమో! అని వినాలి అంటారు.

నేను ఆత్మని అని, సృష్టి అంతా పరమాత్మమయమే అని గురువు ద్వారా విన్నాను, కానీ అది తెలుసుకోవడానికి ఇంకా ఏదైనా మంచి మార్గముందేమో అని ప్రతి వాళ్ళ దగ్గర నుండి వినడము, పుస్తకాలు చదవడం చేయాలి.

అక్కడ అహంకారమేముంది? ఇంకా తెలుసుకోవాలి అన్న తపన వుంటే, అక్కడ అహంకారం లేనట్టే. నాకే అన్ని తెలుసు! నాకు ఒకరు చెప్పనక్కర్లేదు! నేను వినను అని అనుకుంటే, అక్కడ అహంకారం ఉన్నట్టే. అందుకని "అహంకారం ఉన్నవారికి సరైన మిత్రులు ఉండరు" అని మహాత్ములు చెప్తారు.

మరి అసూయతో బతికే వాడికి సరైన నిద్ర ఉండదు, అహంకారంతో బ్రతికే వాడికి సరైన మిత్రుడు ఉండరు.

**3. అనుమానం:–** అనుమానంతో బతికే వాడికి సరైన జీవన విధానం ఉండదు. అంటే ప్రతి విషయాన్ని అనుమానిస్తే, ఆఖరికి వీళ్ళు తనకి మంచి విషయం చెప్పినా, అది కూడా అనుమానిస్తారు.

అలా ఇంట్లో వాళ్ళని, కొంతమంది భార్యని, పిల్లల్ని కూడా అనుమానంతో చూస్తారు. వీళ్ళు నా దగ్గర ఇంత ప్రేమగా ఉంటున్నారు? వీళ్ళకి ఏం లాభం? లేక మిత్రుడు, ఎవరైనా మంచిగా ఉంటే, వీడికి నావల్ల ఏదైనా

సహకారం కావాలేమో? వీడు నాకు ఎక్కువగా పూసుకొని తిరుగుతున్నాడు! అలా ప్రతి విషయాన్ని అనుమానంతో చూస్తే, నీ జీవితంలో ఆనందం అనేది ఉండదు. అది సరైన జీవన విధానం కాదు.

పత్రి గారు చెప్పింది, అనుమానం లేకుండా విన్నాము, కాబట్టే ఈ స్థితికి రాగలిగాము. నువ్వు ఆత్మవి అంటే ఎవరికి తెలుసు? నువ్వు కనిపిస్తున్న శరీరం కాదు, కనబడనిఆత్మ అని అంటున్నారు! ఇదేదో తేడాగా ఉంది. అన్న అనుమాన దృష్టితో చూస్తే మనం ఈ స్థాయికి వచ్చే వారం కాదు. సద్గురువుని నమ్మాము. సత్యం చెబుతున్నాడు అన్న నమ్మకమే, మనల్ని ఇంతవరకు తీసుకొచ్చింది.

అందుచేత అనుమానం అన్నది మనుషుల్లో ఉండకూడని లక్షణం.

**4. అత్యాశ:-** ఆశ వేరు, అత్యాశ వేరు. "అత్యాశపరుడుకి ఎప్పుడు శాంతి వుండదు".

ఈ సంవత్సరం వ్యాపారంలో కొంత లాభం వచ్చింది. తరవాత సంవత్సరం ఇంకా ఎక్కువ రావాలని, అది వచ్చినా ఆపై సంవత్సరం ఇంకా రావాలని అనుకోవడం అత్యాశ. లాభం రావాలని ఆశ పడడం సబబే, అక్కడితో తృప్తి పడితే, ఆ సంవత్సరం అంతా ఆనందంగానే జీవిస్తాడు. కాని అత్యాశకు పోతే ఒకవేళ రాకపోతే ఎంతో అశాంతికి, దుఃఖానికి గురవుతాడు.

అందుకే "అత్యాశపరుడుకి ఎప్పుడు తృప్తి ఉండదు" అంటారు.

ఎందుకంటే ఎవరి అర్హతను బట్టి వారికి ఎంత రావాలో అంతే వస్తుందని తెలుసుకోవాలి. అందుకే పెద్దలు అసలు ఆశే ఉండకూడదు అంటారు.

"అత్యాశ" అంటే ఇంకా కావాలి, ఇంకా కావాలి, అని అనుకోవడం. అంటే ఎంత బంగారం వున్నా ఇంకా కావాలనుకోవడం, ఎంత డబ్బు వున్నా ఇంకా కావాలనుకోవడం అలాగే ఎన్ని సంపదలు వున్నా తృప్తి లేకుండా ఇంకా కావాలనుకోవడం అత్యాశ. ఈ అత్యాశ వల్ల శాంతి ఉండదు.

**5. అజ్ఞానం:-** అజ్ఞానంలో ఉన్నవాడికి ఆనందం ఉండదు. కారణం ఆనందం అనేది ఆత్మ అంటే భగవంతుని లక్షణం, ఆ ఆత్మస్థితి జ్ఞానికే వుంటుంది.

అందుకే పెద్దలు అజ్ఞానం తొలగించుకొని, జ్ఞానం సంపాదించుకోమంటారు.

అందుచేత ముందు అజ్ఞానం అంటే ఏమిటో తెలుసుకుందాం. "నేను ఆత్మ అయినా కూడా "నేను శరీరం అనుకోవడం", "ఆత్మ దేవుడు అయినా కూడా "విగ్రహమే దేవుడు అనుకోవడం", "అశాశ్వతమైన, కనిపించే ఈ ప్రపంచం శాశ్వతం అనుకోవడం" అజ్ఞానం.

అందుకే పత్రీజీ మనల్ని జ్ఞానవంతుల్ని చేడానికే "నువ్వు దేహంకాదు ఆత్మవు" అని చెప్పారు. అంతే కాదు విగ్రహం దేవుడు కాదు, ఆత్మే దేవుడు అని చెప్పాడు.

ఆయన ఇంకా తన 18 ఆదర్శ సూత్రాల్లో! " విగ్రహారాధన వద్దు, సత్యారాధన అంటే ఆత్మారాధన చేయాలి" అన్నారు. కారణం ఆత్మే దైవం కాబట్టి.

అంతే కాదు మనకు కనిపించేదంతా శాశ్వతం కాదు, అవి అన్నీ నశించిపోయేవి అని కూడా చెప్పడం జరిగింది. ఇలా సత్యాన్ని చెప్పి మనల్ని జ్ఞానులుగా చేయడానికే ఆయన ప్రయత్నమంతా! కారణం జ్ఞానికి దుఃఖం వుండదు, ఎప్పుడూ ఆనందంగా జీవించగలుగు తాడు కాబట్టి.

పత్రి గారు విగ్రహారాధన ఎందుకు వద్దన్నారు? కారణం విగ్రహాలు అన్నవి దేవుని ప్రతిరూపాలు! కానీ అసలైన సత్యరూపం నీ శరీరంలోనే. ఆత్మగా ఉంది. అందుచేత ఆత్మరాదనే అసలైన దైవారాధన అని తెలుసుకోవాలి.

ఎవరినైనా అడిగితే భగవంతునికి రూపం లేదు, నామం లేదు, సర్వ వ్యాపి, సర్వాంతర్యామి అని చెబుతారు, కాని విగ్రహారాధన చేస్తూ వుంటే? అజ్ఞానం కాక మరేమిటి? అలాంటివారికి ఆనందం ఎక్కడ దొరుకుతుంది?

"ఆనందస్వరూపుడు", నీ శరీరంలో ఉంటే? నీ శరీరంలోకి పయనించాలి. అంతే కానీ బయట దొరికే అల్పానందం కోసం ప్రయత్నిస్తే ఆనందం ఎలా దొరుకుతుంది?

ధ్యానంలోకి రాకముందు, ఈ ప్రపంచం శాశ్వతం అనుకుంటాము, పత్రిగారి పరిచయం అయ్యాక ఈ ప్రపంచంలో కనిపించేది ఏదీ శాశ్వతం

కాదు అని తెలుసుకున్నాము, అంతా మిథ్యే అని తెలుసుకున్నాము. కాని అన్నీ శాశ్వతం అన్నట్టుగా జీవించడం అజ్ఞానం. అజ్ఞానంలో వున్న వారికి ఆనందం వుండదు.

అందుకే అజ్ఞానం పోవాలంటే? జూమ్ క్లాస్‌లో జాయిన్ అవ్వాలి, భీమవరం క్లాసులకి రావాలి. మరి జూమ్ లోకి రాక, భీమవరం రాకపోతే అజ్ఞానం ఎలా పోతుంది? జ్ఞానం ఎలా వస్తుంది? ఆలోచించండి!

అందుచేత అందరూ నేర్చుకోవాల్సింది, చేయవలసింది, అవగాహన చేసుకోవాల్సింది, ఆచరణలో పెట్టుకోవాల్సింది చాలా ఉంది. అందుచేత గురువులు చెప్పింది ఆచరిస్తూ, దుర్గుణాలు అంటే "అసూయ, అహంకారం, అత్యాశ, అనుమానం, అజ్ఞానం" తొలగించుకోవాలి.

ఈ గుణాలన్నీ వదులుచుకోకపోతే, అసూయతో బతికే వాడికి "నిద్ర" ఉండదు, అహంకారంతో బతికే వాడికి "మిత్రులు" ఉండరు, అనుమానంతో ఉండే వాడికి "సరైన జీవన విధానం ఉండదు", అంటే శాంతి ఉండదు, అజ్ఞానంలో బతికే వాడికి "ఆనందం" ఉండదు అని తెలుసుకోవాలి.

జ్ఞానం పొందాలంటే? శ్రద్ధ ఉండాలని శ్రీకృష్ణులవారు చెప్పారు కదా? అందుకే శ్రద్ధతో వినాలి, ఆచరించాలి.

అందుకే పూర్వం పెద్దలు శ్రద్ధ పెట్టి విను, ఒళ్లంతా చెవులు చేసుకుని విను అని చెప్తూ ఉండేవారు. అంత ఏకాగ్రతతో విన్నప్పుడే, ఈ ఆత్మవిద్య అనేది అంతరంతరాలలోకి చేరిపోతుంది. అలా చేరినది ఎప్పటికీ మర్చిపోరు. మర్చిపోనిది ఏదైనా సరే ఆచరణలో పెట్టుకుంటారు. జ్ఞానాన్ని పొందుతారు.

అలా మనలో లోపాలు సరిచేసుకుంటూ, ఎదగాల్సినవి ఏవో తెలుసు కుంటూ, సాధన చేస్తూ, ముందుకి ఎదుగుతూ, జ్ఞానం పొందుతూ, 10 మందిని జ్ఞానమార్గంలో తీసుకువెళ్లడమే ఎవరి పనైనా.

# త్రికరణ శుద్ధి ఉండాలి అంటే?

సహజంగా మానవుడు తనకోసం తాను పాటుపడతాడు. కాని తనకోసం తాను పాటుపడడం గొప్ప విషయం కాదు. భగవంతుని దృష్టిలో పరుల సేవ చేయడమే గొప్పవిషయం.  అలా చేయాలి అంటే మాట, చేత, ఆలోచన మూడు ఒకటవ్వాలి . దానినే త్రికరణ  శుద్ధి అంటారు.

అంటే ఏదవుతే ఆలోచిస్తారో! అదే మాట్లాడాలి. అలాగే ఏదవుతే మాట్లాడతారో! అదే చెయ్యాలి. దానినే త్రికరణ శుద్ధి అంటారు.

త్రికరణ శుద్ధి అంటేనే సత్యంలో జీవించడం. అంటే మంచి మాట, మంచి ఆలోచన, మంచి చేత.  ఈ మూడు ఆచరించడం అందరికీ సాధ్యం కాదు. ఇది అందరికీ సాధ్యమైతే ఈ ప్రపంచంలో  అందరూ సత్యంలో జీవించడమే కాదు, జీవిత పరమార్ధాన్ని తెలుసుకోగలిగేవారు.

ఎందుచేతనంటే? అంతా  భోగాలకే ప్రాముఖ్యం ఇస్తున్నారు. చాలా కొద్దిమంది మాత్రమే పరమాత్మను చేరుకోవాలని ప్రయత్నిస్తున్నారు.

సహజంగా ఆలోచన ఒక రకంగా ఉంటుంది,  మాటలు, చేతలు ఇంకొరకంగా ఉంటాయి. అది త్రికరణ శుద్ధి అవ్వదు. త్రికరణ శుద్ధి లేకపోతే చేసే పనులు విజయవంతం కావు.

ఉదాహరణకు పరుశరాముడు తల్లి రేణుక ప్రతిరోజు చెరువుకు వెళ్లి ఇసుకతో తన తపోశక్తితో ఇసుకతో  కుండను చేసి. ఆ కుండలో నీళ్లు పట్టుకుని వెళ్ళేది. ఒకరోజు ఆకాశమార్గంలో ఒక గంధర్వుడు వెళుతుంటే చూసి ఎంత బాగున్నాడు అని ఆలోచించింది. ఆలా ఆలోచిస్తూ ఇసుకతో కుండను తయారు చేస్తుంటే? ఆ కుండ తయారవ్వట్లేదు.  ఎన్నిసార్లు కుండ చేసినా అవలేదు. చూడండి ఆలోచనలో దోషం వల్ల తపోశక్తిని కోల్పోయి తాను చేయవలసిన పని సవ్యంగా చేయలేకపోయింది .

మనిషి అంటే ఆలోచన ప్రభావంతో జీవించేవాడు కాబట్టి ఆలోచన కూడా శుద్ధత్వంలో ఉండాలి. ఆలోచనలలో దుష్ట సంకల్పాలు, దుష్ట ఆలోచనలు ఉన్న వారు బయట వారి దగ్గర ఎంత తీయగా మాట్లాడినా, ఎలా పనిచేసినా

అవి విజయవంతం కావు. అందుకే ఆలోచన, మాట, చేత మంచిగా వుండాలి అంటారు పెద్దలు.

అంతేకాదు బుద్ధి సరిగ్గా ఉంటేనే సరియైన నిర్ణయాలు తీసుకుంటారు. సరైన పనులు చేస్తారు. అలాంటి త్రికరణ శుద్ధి ఉండాలంటే? 'శ్వాస మీద ధ్యాస' ఉంచి తీవ్రమైన ధ్యానసాధన చెయ్యాలి. దానితో పాటు సాత్వికమైనశాఖాహారం తీసుకోవాలి. అంటే విశ్వశక్తితో తయారైన ఫలహారం, సస్యాహారం తీసుకోవాలి. శాఖాహారం శరీరానికి శక్తినిస్తుంది.

మాంసాహారం తినడం అంటే శవాహారం తినడం. ఆ జీవిని చంపి తినడం వల్ల శక్తి తగ్గిపోతుంది. చూడండి మనిషి చనిపోతే శవం అంటారు.. అలాగే ఏ జీవి, ప్రాణి చనిపోయినా శవం అంటారు. శవం కుళ్ళిపోతుంది, అందులో జీవకణాలు నశించి ప్రాణశక్తిని కోల్పోవడంవల్ల ప్రాణశక్తి ఉండదు, కాబట్టి అది పాడైపోతుంది.. కాని కూరగాయలలో ప్రాణశక్తి చాలా రోజులు ఉంటుంది. అందుకే ప్రాణశక్తి అధికంగా ఉండే శాఖాహారం తీసుకోవాలని అంటారు.

భగవంతుని దృష్టిలో మంచి ఆలోచన అంటే తనకోసం తాను ఆలోచించడం కాదు, పరుల మంచి కోసం ఆలోచించగలగడమే మంచి ఆలోచన.

పుట్టపర్తి సాయిబాబావారు "పరులసేవే పరమాత్మ సేవ– జీవుడిసేవే జీవేశ్వరుడి సేవ" అని చెబుతూ ఉండేవారు.

వివేకానందులు కూడా "విశ్వం కోసం నీవు పాటుపడితే విశ్వేశ్వరుడు నిన్ను చూసుకుంటారు" అన్నారు.

ఈ ప్రపంచంలో గొప్ప పుణ్యకర్మ ఏది అంటే అందరికీ ధ్యానం, జ్ఞానం నేర్పించడం. ప్రపంచం వైపు ఉన్న మనసును భగవంతుని వైపు తిప్పడమే ధ్యానం అంటే. అందుకే ధ్యానం నేర్పడం కంటే గొప్ప పుణ్యం లేదు అంటారు.

నేను నా శక్తినంతా సంసారం కోసము ఉపయోగిస్తే నేను ఇంత జ్ఞానవంతురాలిని అయ్యేదాన్ని కాదు. మా బాబు అంటాడు మీరిద్దరూ చాలా పుణ్యాత్ములు, భగవంతుడు మీకు శక్తిని ఇస్తున్నాడు కాబట్టి మీరు

తిరగగలుగుతున్నారు అంటాడు. నేను ఒక్కరోజు ఎక్కడికైనా వెళితే నీరసం వస్తుంది, మీరిద్దరూ  ఎలా తిరుగుతున్నారు అని ఆశ్చర్యపోతున్నాడు .

పరుల కోసమే ఈ జీవితం ఖర్చు పెట్టాలి అనే ఆలోచన నీలో మొదలైనప్పుడు చేయించడానికి కావలసిన శక్తి పరమాత్మ నుంచి వస్తుంది. అందుకే మహాత్ములు చెప్పారు మంచి ఆలోచన నీ మనసుకు శక్తి నిస్తుంది అని.  నేను, నా పిల్లలు, నా ఇల్లు, నా సంసారం అనుకుంటే  అది స్వార్థం అవుతుంది. నీ సంసారంతో పాటు పరులకు కూడా సేవ చేస్తే అది నిస్వార్థమవుతుంది.

అందుచేత ఈ జ్ఞానాన్ని నేర్చుకుంటూ, సత్యం అర్థం అయినప్పుడు, ధర్మం తెలుసుకున్నప్పుడు... అజ్ఞానంలో అధర్మం వైపు నడుస్తున్న వారందర్నీ సత్యం వైపు మరల్చడానికి ప్రయత్నించడమే  ప్రతి మానవుని కర్తవ్యం. భూమి మీద పుట్టిన ప్రతి మానవుడికి ఒక ధర్మం ఉంది. ఏమిటా ధర్మం అంటే? సత్యాన్ని అన్వేషించాలి, సత్యం ఏమిటో తెలుసుకోవాలి, ఆ సత్యాన్ని చేరే ప్రయత్నం చేయాలి.

పత్రి గారు సాధనతో పాటు స్వాధ్యాయము కూడా చెప్పడం జరిగింది. ఒక పుస్తకం మన జీవితాన్ని మార్చే అంత శక్తి ఇస్తుంది అన్నారు. 'శ్వాస మీద ధ్యాస' ధ్యానం నీవు చేసిన రోజున నీ ఆత్మ శక్తి పెరుగుతుంది అన్నారు. ఆత్మ శక్తి పెరిగేకొద్దీ బుద్ధి పెరిగి మాట మీద ఎరుక, మనసు మీద ఎరుక వస్తుంది. ఏ పని చేయాలో, ఏ తిండి తినాలో, అదే తింటావు ఏ ఆలోచన చేయాలో అదే చేస్తావు. ఏది సత్యమని నమ్ముతావో అదే జ్ఞానం తీసుకుంటావు.

అందుకే మహాత్ములు ఒక మాట అంటారు పరమాత్మ కృప, గురుకృప నీమీద ఉంటే?  నీవు యోగిగా మారగలవు.  పరమాత్మ కృప వలన గురువు లభిస్తాడు. గురువు కృప వలన సాధన, జ్ఞానం పెరుగుతుంది.

వాటి వల్ల మంచి ఆలోచన, మంచి మాట, మంచి చేత మన జీవితంలోకి వస్తాయి. అటువంటి వారు త్రికరణ శుద్ధిగా జీవించగలరు.

అందుకే అన్నమాచార్యుల వారు ఏమన్నారంటే! 'త్రికరణ శుద్ధిగా చేసే పనులు దైవం మెచ్చును, లోకులు మెచ్చును" అని.

# మాట ఎలా ఉండాలి?

ఎంత సాధన చేసినా ఒక్కోసారి మనకు తెలియకుండానే మాట్లాడేస్తూ వుంటాం. అలా మాట్లాడటం వల్ల కూడా ఎన్నో కర్మలు పెంచుకుంటాము. అందుకే శ్రీ కృష్ణ భగవానుడు మనం మాట్లాడే మాట ఎలా ఉండాలో భగవద్గీత 17వ అధ్యాయం 15వ శ్లోకంలో చెప్పారు.

**శ్లో॥ అనుద్వేగకరం వాక్యం సత్యం ప్రియహితం చ యత్**
**స్వాధ్యాయాభ్యసనం చైవ వాఙ్మయం తప ఉచ్యతే (భ.గీ.17-15)**

తా:- ఇతరుల మనస్సునకు భాధ కలిగింపనిది, సత్యమైనది, ప్రియమైనది, మేలు కలిగించునదియునగు వాక్యమును వేదాదుల యొక్క అధ్యయనమును అభ్యసించునది వాచక తపస్సు అని చెప్పబడుచున్నది.

అందుచేత మనం మాట్లాడే మాటలు ఎలా ఉండాలి అంటే

1. అనుద్వేగకరంగా మాట్లాడాలి, 2. సత్యం మాట్లాడాలి, 3. ప్రియంగా మాట్లాడాలి, 4. హితంగా మాట్లాడాలి, 5. మితంగా మాట్లాడాలి.

మనం మాట్లాడేటప్పుడు ఈ జాగ్రత్తలు తీసుకోవాలి.

**1. 'అనుద్వేగకరంగా మాట్లాడాలి" :** అంటే ఆవేశపడకుండా మాట్లాడాలి. చీటికి మాటికి ఆవేశపడకూడదు. అలాగే ఎదుటి వారికి ఆవేశం కలిగించే మాటలు మాట్లాడకూడదు.

అంటే ప్రాపంచిక జీవితంలో పొరపాట్లు అహంకారంతో చేస్తారు. కానీ ఆధ్యాత్మిక జీవితంలో అహంకారం తగ్గినట్టు అనిపిస్తుంది, కానీ ఏదో కారణంగా ప్రతి క్షణం బయటికి వస్తుంది.

ఒక్కోసారి మనం ఆవేశపడి మాట్లాడిన మాటలకు అవతలివాడు హర్ట్ కావచ్చు. అందుకే మనం అనుద్వేగ కరంగా మాట్లాడాలి. అంటే ఎదుటివారిని టెన్షన్ పెట్టే మాటలు మాట్లాడితే! వారు మీ మాటల వల్ల టెన్షన్ పడితే ఆ కర్మ మీకు వస్తుంది. అందుకే మనం ప్రతిక్షణం ఎరుకలో ఉండాలి.

ఉ:-మనకు పని మనిషి రావాలి. కానీ రాలేదు. ఆ సమయం కాగానే

వస్తుంది అని ఒక పాజిటివ్ థింకింగ్ తో ఉండాలి. కాని ఇంకా రాలేదు ఈ పని ఎలా అవుతుంది? అని మనం ఆవేశ పడిపోయి ప్రక్క వాళ్ళను కూడా టెన్షన్ పెట్టకూడదు. అందుకే మన మాట అనుద్వేగకరంగా ఉండాలి అంటారు.

**2.సత్యం మాట్లాడాలి:**

ఎప్పుడూ సత్యాన్ని పలకడానికి ప్రయత్నించాలి. ఎవరో ఒకరు మనకు ఎన్నో విషయాలు చెప్తుంటారు. అది సత్యమా, అసత్యమా అని విచారణ లేకుండా విన్న ప్రతిదీ సత్యం అని ప్రతివాడికి చెప్తే? అది ఒకవేళ అసత్యం అయితే! మనం అసత్య ప్రచారం చేసిన వాళ్ళం అవుతాం.

అందుచేత అది ఎంతవరకు సత్యం? అని ఆలోచించాలి. నీకు తెలిసిన సత్యం పదిమందికి చెప్పు. అందుకే పత్రి గారు నీవు ఎంత సత్యంలో జీవిస్తున్నావో విచారణ చేసుకో! అసత్యం మాత్రం ప్రచారం చేయకు అన్నారు.

కాని విచారణ చేసి ధ్యానమే గొప్పది, జ్ఞానమార్గమే గొప్పది అనే సత్యాన్ని పదిమందికి బోధించు. ఆత్మే భగవంతుడు అన్న గొప్ప సత్యాన్ని తెలుసు కున్నప్పుడు ఆత్మను ఎలా చేరుకోవాలో అన్న సత్యాన్ని చెప్పాలి.

**3.ప్రియంగా మాట్లాడాలి:-** మనం ఎప్పుడూ ప్రియంగా మాట్లాడాలి.

ఉదా:- రోగంతో భాధపడేవాడిని నీవు ఎన్నో పాపాలు చేసి వుంటావు అని మన నోటి వెంట రాకూడదు. ఎందుచేతనంటే అసలే బాధపడుతున్న వారిని ఇంకా బాధించకూడదు.

ఎదుట వారిని బాధ పెట్టకుండా, విమర్శించకుండా, తప్పులను పదేపదే ఎత్తిచూపకుండా ప్రియంగా మాట్లాడాలి.

**4.హితంగా మాట్లాడాలి:** మనం మాట్లాడే మాట అవతలి వాడికి ఎప్పుడూ కూడా హితంగా ఉండాలి. మనం మాట్లాడిన మాటల వల్ల అవతలి వాడికి మంచే జరగాలి. ఇది ముందు మనం నేర్చుకోవాలి.

ధ్యాన సాధన ఇతరులకు చెప్పాలి, జ్ఞానాన్ని చెప్పాలి. అలా చెప్పడం వలన వారి హితం కోరిన వాళ్ళం అవుతాం.

తటవర్తి సార్ ఎన్నో చోట్ల ధ్యానం క్లాసులు నిర్వహిస్తున్నారు. ఎంతో

మందికి జ్ఞానం బోధిస్తున్నారు. ఇదంతా  అందరి హితం కోరి చేస్తున్నారు. దాన్ని మనం వినియోగించుకోవాలి. జీవులను చంపడం మహాపాపం అని చెప్పి, వారిచేత మాన్పిస్తే, వారి హితం కోరిన వారం అవుతాం.

ఇంకా ఎవరైనా రోగంతో బాధపడుతుంటే వారికి "శ్వాస మీద ధ్యాస" ధ్యానం చేయమని చెప్పడం అన్నది హితమైన మాట. అందువల్ల వారు ధ్యాన సాధన చేసి స్వస్థత పొందుతారు.

**5. మితంగా మాట్లాడాలి:-**

వీలైనంతవరకు తక్కువ మాట్లాడాలి, వదవద వాగకూడదు. అవసరం ఉంటేనే మాట్లాడాలి, లేకుంటే మన నోట్లో నుంచి ఒక్క మాట కూడా బయటకి రాకూడదు.

మునులు ఎప్పుడు  మౌనంగా ఉంటారు. అందువల్ల వాళ్లకు శక్తి పెరుగుతుంది. అందుకే వాళ్ళు అన్న ప్రతి మాట జరుగుతూ ఉంటుంది. అందుకే మునులు ఎప్పుడూ మౌనంగా ఉండి వాళ్ళలో అంతర్గత శక్తిని పెంచుకొని ఆ శక్తిని వారు వారి శిష్యులకు కానీ, లోక కళ్యాణకరమైన పనులకు కాని వాడేవారు.

మనం ఎప్పుడూ మాట్లాడుతుండడం వల్ల మన శక్తిని కోల్పోతాం. అందుకే పత్రీజీ చెప్తారు. మనం మాట్లాడిన మాట ప్రక్కవాడికైనా ఉపయోగపడాలి, మనకైనా ఉపయోగపడాలి. ఉపయోగపడని ఒక్క మాట నీ నోటి వెంట రాకూడదు అని అంటారు. చాలామంది అనవసరంగా చెత్త మాటలు గంటలు గంటలు మాట్లాడుతుంటారు. అలా మాట్లాడినప్పుడు వారి శక్తిని కోల్పోతారు.

అందుకే  మన మాటలు మితంగా, ఉండాలి. ధ్యానం చేస్తే ఎక్కువ మౌనంగా ఉంటారు. మనం ఎంత మౌనంగా వుంటే అంత శక్తివంతమవుతారు.

మితంగా ఎందుకు మాట్లాడాలంటే? మనం  మాటలు కూడా కర్మలు కాబట్టి.  మరి ఈ కర్మల వల్లనే జన్మలు పెరుగుతాయి. ఇది అందరూ గుర్తుంచుకోవాల్సిన విషయం.

అందుచేత మాటల విషయంలో ప్రతి ఒక్కరూ చాలా జాగ్రత్తగా వుండాలి.

# ఆశ

ప్రతి మనిషికి ఆశ  ఉంటుంది.  అందరి కంటే నేను బాగుండాలి అనుకునేది ఆశ. ఒక్కటే కాదు ఎన్నో విషయాల మీద ఆశ  ఉంటుంది.

ఏ చిన్న ఆశ నీలో ఉన్నా, ఏ చిన్న కోరిక ఉన్నా, నీవు మాయకు వశం అయినట్లే అంటారు రమణ భగవానులు. మరి ఈ మాయను ఎలా పోగొట్టుకుంటావు? అంటే ఇది మాయ   అని ఎరుకలోకి వచ్చి, ఈ మాయ నన్ను వశం చేసుకుంది అని నీకు నీవుగా తెలుసుకుంటే కొన్నాళ్ళకి మాయలోంచి బయటపడగలవు.

ఈ ప్రపంచం అశాశ్వతం అని తెలుసుకున్నప్పుడు, నీవు కోరుకునేవి అశాశ్వతం అని ఎందుకు తెలుసుకోవు? కారణం మాయలో ఉండబట్టే.  ఆలా ఆశలో, కోరికలలో ఇరుక్కుపోతున్నారు.

ఈ ఆశలు, కోరికలు, నీవి కావు.  ప్రక్కవాడిని చూసి నీకు అదే కావాలి అనిపించింది. అంటే? ప్రక్క వాడికి  లేనప్పుడు నీకు అనిపించలేదు.  ప్రక్క వాడికి ఉన్నప్పుడు నీకు కావాలని అనిపించింది,  ఆశ పుట్టింది.  తీరకపోతే నిరాశే. ఇవన్నీ ఎందుకు వచ్చాయి అంటే ధ్యాన సాధన లేకపోవడం వలన.

సాధనా చతుష్టయం సరిగ్గా అచరించకపోతే సాధనలో ఎదగలేరు అని ఆదిశంకరాచార్యులు వారు చెప్పడం జరిగింది. ధ్యానసాధనలోకి వచ్చాక కూడా నా ఆరోగ్యం బాగోవాలి, నాకు ఇది కావాలి, అది కావాలి  అని ఆశ పడుతున్నావు. దీనికి కారణం గురువు బోధించింది సరిగ్గా అర్థం చేసుకుని ఆచరించక పోవడమే.

ప్రతి సాధకుడికి వినడం ద్వారా చాలా మార్పు వస్తుంది. స్వాధ్యాయం ద్వారా ఇంకా మార్పు వస్తుంది. పత్రి గారు కానీ,  వశిష్టులు లాంటి వారు కానీ స్వాధ్యాయం చెయ్యాలి అన్నారు. ఈ రోజుల్లో స్వాధ్యాయం లేక చాలా మంది ధర్మమంటే ఏమిటి? సత్యం అంటే ఏమిటి? జ్ఞానం అంటే ఏమిటి ?

తెలుసుకోవటం లేదు. ఇవన్నీ తెలుసుకోవాలి అంటే ఆధ్యాత్మిక పుస్తకాలు చదవాలి.

ఆశ ఉంటేనే ప్రయత్నం జరుగుతుంది. ఆశను ఎప్పుడు వదులుకోగలవు అంటే? నేను ఆత్మను, నా జీవితాన్ని నేను ఎన్నుకొని భూమి మీదకు వచ్చాను, ప్రకృతికి అనుగుణంగా జీవిస్తున్నాను అని అనుకున్నప్పుడు ఆశను వదులుకో గలవు. అలాంటివారికి మనకంటే కోటీశ్వరులు భూమి మీద ఎవరూ లేరు అని అర్థమవుతుంది. అలాంటివారు చిన్నచిన్న కోరికలకు బాధపడరు.

ఎవరైతే ఆత్మజ్ఞానం, బ్రహ్మజ్ఞానం కోసం పరితపిస్తారో వారు పరమాత్మకు ఇష్టులు అని ఉపనిషత్తులు ఘోషిస్తున్నాయి. ధ్యాన సాధన అంటే తపస్సు రాక్షసులు చేశారు, దేవతలు చేశారు. రాక్షసులు శారీరక, మానసిక కోరికల కోసం తపస్సు చేశారు. కానీ దేవతలు ఆత్మ శక్తి పెంచుకోవడానికి ధ్యాన సాధన చేశారు. దేవతలు లాగ మన దృష్టి ఎప్పుడూ ఆత్మ జ్ఞానం, బ్రహ్మజ్ఞానం మీద వుండాలి.

కానీ అది మరిచిపోయి మన ప్రక్క వారిని, ఎదుటివారిని, చుట్టూ వున్న వారిని, చుట్టాలను, బంధువులను చూసి వారిలాగే ఉండాలని అన్నింటి మీద ఆశపడుతున్నాం. ఆశ మనిషిని దిగజారుస్తుంది. ఆశ ఉండవచ్చు...కాని ఎంతవరకు వుండాలో అంతవరకు ఉండాలి. కోరికలు తీర్చుకోవచ్చు మనకు ఉన్నదాంట్లోనే అనుభవించాలి. అంతేకాని వాళ్ళని చూసి, వీళ్లను చూసి కాదు.

కళ్ళు తెరిస్తే ఉండే ప్రపంచం, కళ్ళు మూసుకుంటే ఉండదు. ఇది మాయ. ఒక్కటి గమనించండి మనం గాఢ నిద్రపోయాం చాలా సుఖంగా వుంది. గాఢ నిద్రలో ఏ ఆశ, ఏ కోరిక లేదు, అందుచేత సుఖంగా నిద్ర పోయావు. మెలుకువ వచ్చాక ప్రపంచాన్ని చూస్తున్నావు కావాలి అనిపిస్తుంది. కావాలి అని ఎప్పుడు అనిపిస్తుంది అంటే ఉన్న దానితో తృప్తి లేనప్పుడు కావాలి అనిపిస్తుంది. అందుకే మహాత్ములు ఉన్నదానితో తృప్తి పడు అని చెప్తారు.

ఆశ, కోరిక వదిలితేనే దుఃఖం లేని స్థితిలో నీవు ఉంటావు. ఆశ, కోరికగా

మారుతుంది. కోరిక తీరకపోతే దుఃఖం వస్తుంది. అంటే నీ దుఃఖానికి కారణం నీలో ఉండే ఆశ. చూడండి జంతువులకు ఏ ఆశ లేదు, అందుకే హ్యాపీగా బ్రతుకుతాయి. అలాగే చిన్నపిల్లలు చూడండి ఎప్పుడూ నవ్వుతూనే ఉంటారు, ప్రశాంతంగా నిద్రపోతారు కారణం ఏ ఆశ లేదు కాబట్టి.

మనం గాఢ నిద్రలో హాయిగా ఉన్నప్పుడు ఆశ లేదు. ఆశలేని స్థితిలో హాయిగా ఉంటుంది. అందుచేత ఉన్నదానితో తృప్తి పడుతూ, ఆశను ప్రక్కన పెట్టి ఆధ్యాత్మికంగా ఎదగాలి అనే ఒక్క కోరిక ఉంచుకుంటే సాధన చాలా ఇష్టంగా చేస్తాం. ఆశ మనస్సుకు సంబందించినది. ఆ మనసు మార్చగలిగే శక్తి ఒక్క ధ్యాన సాధనకి ఉంది.

అందుచేత ధ్యాన సాధన తీవ్రంగా చేస్తే మనస్సు యొక్క ప్రాముఖ్యం తగ్గి, మనసు శుద్ధమై ఆశ తొలగిపోతుంది, తృప్తి జీవించగలుగుతారు.

# సోమరితనం

సోమరితనం అంటే చెయ్యాలనుకుని వాయిదా వేయడం, చెయ్యక పోవడం.

మానవ జన్మలో చేయాల్సిన పనులు చెయ్యకపోవడానికి కారణం ఏమిటి? కొంతమంది తెలియక చేయరు, కొంతమంది తెలుసుకుని కూడా చేయలేకపోతున్నారు.

దానికి కారణం సోమరితనం అని వశిష్టుల వారు చెప్పారు. ప్రాపంచిక జీవితంలో అయినా, ఆధ్యాత్మిక జీవితంలో అయినా సోమరితనమే మానవుడు ఎదగలేకపోవడానికి కారణం.

అపరా విద్య అంటే ప్రాపంచిక విద్య, పరావిద్యా అంటే ఆధ్యాత్మిక విద్య అని రెండు రకాల విద్యలు ఉన్నాయి. ఎవరైనా అపరా విద్య ముందు నేర్చుకోవాలి. కారణం ఆ విధ్య లేకపోతే పరావిద్యలోకి వెళ్లలేరు.

ప్రతి మానవుడిలో ఉన్నది ఒకే ఆత్మశక్తి. కాని కొందరు ఉత్సాహంగా పనిచేస్తూ ఉంటారు, కొందరు పనిచెయ్యరు. కారణం ఆ వ్యక్తిలో ఉన్న సోమరితనమే. అన్ని అనర్ధాలకి మూలం సోమరితనమే. సోమరితనం వున్నవారు ఏ పురుష ప్రయత్నం చెయ్యరు.

ఈ సోమరితనం ఉన్నవాళ్లని వశిష్టులవారు గాడిద సమానులుగా పేర్కొంటారు. చూడండి చాకలి గాడిదని కొట్టి మూటలు మోయిస్తాడు. లేకపోతే అది మోయదు.

మరి సోమరిపోతులు కూడా అలాంటివారే! కాని ఆధ్యాత్మిక జీవితంలో సాధకుడికి అది చాలా అడ్డు. ఎందుకంటే? మానవ జన్మ తీసుకున్న ప్రతి ఒక్కరూ జ్ఞానపరంగా ఎదగాలి. మరి దానికి కావలసిన యోగాభ్యాసం చేయడానికి ఈ సోమరితనం చాలా అడ్డంకి.

సాధకుడు ఆధ్యాత్మిక మార్గంలో చేయవలసిన సాధనలు తెల్లవారుజామునే లేచి చెయ్యాలి. కాని అలా లేవలేక పోవడానికి సోమరితనమే

కారణం.

ఆ సోమరితనం అనే గుణాన్ని పోగొట్టుకుంటేనే  సాధకుడు అత్యున్నత స్థానానికి ఎదగగలడని వశిష్టుల వారు చెప్పడం జరిగింది.  సోమరితనం పోవాలంటే సరియైన ఆహారం, సరియైన వ్యవహారం  సరియైన నిద్ర వుండాలని గురువులు చెప్తారు.

సరైన ఆహారం అంటే  మిగతాహారం అంటే అధికంగా తినకూడదు, తక్కువ తినకూడదు. అలాగే  నిద్ర కూడా అధికంగా ఉండకూడదు, తక్కువ ఉండకూడదు.

ఈ సోమరితనం వల్ల సాధించగలిగే శక్తి ఉన్నా కూడా సాధించలేక పోతారు.  ధ్యానం చాలా గొప్పదని చెప్పినా  చేయలేకపోవడానికి కారణం వారిలో ఉన్న సోమరితనమే.

ఎవరైనా సరే  కష్టపడి ధ్యాన సాధన చేసి,  బుద్ధి వికసింప చేసుకుని, కర్మలను దగ్ధంచేసే జ్ఞానాన్ని పెంచుకోవడం సోమరితనంవల్ల  చాలా కష్టంగా భావిస్తారు. చాలామంది అన్నీ తెలిసినాకూడా సాధన తీవ్రతి తీవ్రంగా చేయలేకపోతున్నారు అంటే  సోమరితనమే కారణం. సోమరితనం లేని వాడు ఆధ్యాత్మికంగా తొందరగా ఎదుగుతాడు. సోమరితనం ఉన్నవాడు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్టు ఉంటాడు.

అందుకే వెనకపడినవారు నేనెందుకు వెనకబడుతున్నాను? వాళ్లు చేయగలిగింది నేనెందుకు చేయలేకపోతున్నాను? అని ఆలోచిస్తే కారణం ఎక్కడోలేదు నాలోఉన్న సోమరితనమే కారణం అని అర్థమవుతుంది.

ప్రయత్నం చేస్తే ఏదైనా సాధించవచ్చు.  మనందరికీ మానవ జన్మ వచ్చింది, మంచి సద్గురువు దొరికాడు, చేయగల సమర్ధత వుంది. కానీ ఈ మూడు ఉన్నా సాధన పట్టుదలతో ఎందుకు చేయలేకపోతున్నాము అంటే సోమరితనమే.

ప్రతి వాళ్లు నేను నేర్చుకున్నది ఆవగింజంత, నేర్చుకోవాల్సింది మేరు పర్వతమంత ఉంది అని తెలుసుకోవాలి.  ఈ జన్మలోనే నేర్చుకోవడం పూర్తి

చేయగలగాలి. ఆలా అనుకుంటే నిద్దట్లో కూడా మెలుకువ వచ్చి ఆ పని చేయాలి అనిపిస్తుంది. దేనికైనా సరే ముందర మన మీద మనం జాలిపడటం మానేస్తే సోమరితనం మన దరిదాపులకు కూడా రాదు.

గుర్తుంచుకోండి గురువు శిష్యుడికి ఒక పని చెప్తున్నాడు అంటే, శిష్యుణ్ణి షార్ప్ గా తయారు చేయాలనే తపనే. మనలో సోమరితనం రాకూడదని ఆయన ఆ ప్రయత్నం చేస్తూ ఉంటారు. గురువు మనలో ఉత్సాహాన్ని నింపడానికి, మన మనసు ప్రాపంచికంలో కాకుండా ఆత్మవైపు తిరగడానికి, ఈ జ్ఞానం పొందడానికి ఎంతో ప్రయత్నిస్తూ ఉంటారు.

సాధన, స్వాధ్యాయం, సజ్జన సాంగత్యం... ఎవరైతే సోమరితనాన్ని వీడి ఈ మూడిట్లలోనూ పాల్గొంటూ ఉంటారో ఉన్నత స్థితికి ఎదగడానికి అవకాశం ఉంటుంది అని వశిష్టుల వారి దగ్గర నుంచి పత్రీజీ గారి వరకు ఇదే విషయం చెప్పడం జరిగింది.

గురువును చూసి మనం నేర్చుకోవాల్సిన మొట్టమొదటి విషయం మన సోమరితనాన్ని వదిలించుకోవడం.

గురువులు ఎప్పుడు ఒక్క క్షణం విశ్రాంతి తీసుకోరు. మనల్ని పదును పెడుతూనే ఉంటారు. ఎప్పుడూ ఒక్క క్షణం కూడా విశ్రాంతి తీసుకోరు శరీరాన్ని కష్టపెడుతూనే ఉంటారు. ఆయన ప్రతి మాట, ప్రతి చేత ఉపయోగకరమే. మరి పత్రిగారు అంత అద్భుతంగా జీవించి, సాధకుని జీవన విధానం ఇలా ఉండాలి అని చూపించారు.

సోమరియై తిరుగువాడు సూక్ష్మము గ్రహించలేడు అంటే మన దేహంలో సూక్ష్మాతి సూక్ష్మంగా ఉన్న ఆత్మను తెలుసుకోలేడని అర్థం. అంటే సోమరితనం వదిలి సాధన, సజ్జన సాంగత్యం, స్వాధ్యాయం చేసిన రోజునే ఆ సూక్ష్మతి సూక్ష్మమైన ఆత్మ తత్వాన్ని తెలుసుకోగలం కానీ సోమరితనం ఉన్నవాడు ఏదీ సాధించలేడు అని మనకి అర్థమవుతుంది.

ప్రతిరోజు జూమ్ లో పాల్గొనలేక పోవడానికి కారణం సోమరితనమే. నేను కచ్చితంగా చెప్పగలను చాలామంది జూమ్ లోకి వచ్చాక చాలా

అద్భుతమైన మాస్టర్స్ గా అద్భుతమైన జ్ఞానాన్ని పొందుతున్నారు. నిజంగా త్రీ డేస్ వర్క్ షాప్ ఒకటే ఉంటే ఎప్పుడో నెలకొకసారి మనం కలుసుకునే వాళ్ళం.

కరోనా అందరికీ ఎంత చెడ్డ తెచ్చిందో మనకి తెలియదు కానీ మన జూమ్ మాత్రం ధ్యానంలో అద్భుతంగా ఎదగడానికి ఉపయోగపడింది. అందుచేత కొంచెం సోమరితనాన్ని వదులుకుంటే అన్ని సాధించడం సాధ్యమే!

భూమి మీద అసాధ్యాలంటూ ఏవి ఉండవు, అన్ని సాధ్యమవుతాయి. అందుకే మనిషి పతనం అవ్వడానికి సోమరితనం, బద్ధకమే కారణం. కాని అవి రెండూ వదులుకుంటే అత్యున్నత స్థితికి చేరగలిగే శక్తి ప్రతి మానవుడిలోనూ ఉంది.

ఎందుకంటే పత్రిగారి వల్ల మనం ఆత్మ శక్తి ఎలా పెంచుకోవాలో అన్నది తెలుసుకున్నాం. కాని పత్రిగారి వల్ల కొంతమంది మాత్రమే సరైన సాధన నేర్చుకున్నారు. మహాత్ముల చరిత్రలు మహానుభావులు చరిత్రలు తిరగవేస్తే, వాళ్ళు ఆధ్యాత్మికంగా ఎంత ఉన్నత స్థితికి వెళ్లారు, గొప్ప గొప్ప కార్యాలు చేయగలిగారు అన్నది మనకి అర్థమవుతుంది.

మనం కాళీగా ఉన్నపుడు ధ్యాన సాధనకు గాని, జ్ఞానం పెంచుకోవడానికి కాని టైం ఉపయోగించకపోతే మనం కూడా సోమరితనంలో ఉన్నట్టే.

మేమిద్దరం సోమరితనాన్ని వదిలాం కాబట్టే ఈ వయసులో కూడా తిరగగలుగుతున్నాం. సోమరితనమే ఉంటే ఆ ఏం చేస్తాంలే రెస్ట్ తీసుకుందాం అని సోమరితనంగా పడుకుంటాం. వశిష్టుల వారు ఏమన్నారంటే! సోమరితనాన్ని వదిలి ఉత్తమమైన పురుష ప్రయత్నం చేస్తే భూమి మీద సాధించలేనిది ఏదీ ఉండదు అన్నారు.

అందుచేత సాధకులైనవారు ఆహారం తీసుకుంటూ, సరియైన వ్యవహారంలో ఉంటూ సోమరితనాన్ని తొలగించుకుని జ్ఞానపరంగా ఇంకా ఇంకా ఎదగాలి.

# ఏది సరి అయిన సాధన?

ఎందుకంటే నాకు తెలిసి మన పిరమిడ్ సొసైటీలో ఉన్నవాళ్లే గంటలు గంటలు ధ్యానం చేయగలరు. మరి అంత బాగా పత్రిగారు ట్రైనింగ్ ఇవ్వడం జరిగింది. అయితే తర్వాత రాను రాను  ఎన్నో రకాల ధ్యానాలు రావడం జరిగింది.

మరి ఎన్నో రకాల ధ్యాన సాధనలు ఎందుకు వస్తున్నాయి? ఏది అసలైన ధ్యానం అని ఎలా తెలుసుకోగలం? అని నాకు అనుమానం వుండేది.

అప్పుడే నేను చదువుతున్న పుస్తకాల్లోంచి నాకు ఏది అసలైన ధ్యానం అని సాధకుడు తెలుసుకోవాలి అంటే ఈ మూడు పాయింట్లు నేను  మీ ముందు ఉంచుతున్నాను. ఏది అసలైన ధ్యానం? ఏది మంచి సాధన?  ఏది మనల్ని ఉన్నత స్థితికి తీసుకొస్తుంది? అన్నది ఈరోజు మనం తెలుసుకుందాం.
**1) ఏ సాధన అయితే మనసుకి ప్రశాంతత ఇస్తుందో అది అసలైన సాధన మంచి సాధన.**

మనం తెలుసుకున్నాం మనస్సు  పని చేయని స్థితికి తీసుకువెళ్లడమే ధ్యానం అని. అంటే "నిర్విషయ మనః ధ్యానం" అని పతాంజలి మహర్షి చెప్పాడు. మనసు ఆలోచనలతో ఉంటే అది పనిచేస్తున్నట్టు.

మనం గమనిస్తే మానవుడు పగలంతా మనసుతో పనిచేసి రాత్రి ప్రశాంతంగా నిద్రపోతూ ఉంటాడు. ఎందుకు? అంటే అక్కడ మనసు పని చేయదు కాబట్టి, ప్రశాంతంగా నిద్రపోతున్నాడు.

మరి ఏది సరైన సాధన? అంటే "ఏది మనసుకు  ప్రశాంతతనిస్తుందో! అదే సరైన సాధన అని మనం తెలుసుకోవాలి."

అంటే 'శ్వాస మీద ధ్యాస' పెట్టి కూర్చుంటే ఆలోచనలన్నీ తొలగిపోయి మనసు ప్రశాంతత పొందుతుంది. అందుచేత అదే సరైన సాధన అని తెలుసుకోవచ్చు.

**2) ఏ సాధన చేస్తే నీకు అరిషడ్వర్గాలు అదుపులో ఉంటాయో అదే అసలైన మంచి సాధన.**

ఇక్కడ గమనిస్తే అరిషడ్వర్గాలు అంటే కామ, క్రోధ, లోభ, మోహ, మద, మాత్సర్యాలు అనేవి మనసువి.

అంటే ఈ అరిషడ్వర్గాలను మన అదుపులో ఉంచగలిగే సాధనే సరియైన సాధన అని చెప్పుకున్నాం. అందుచేత ఈ అరిషడ్వర్గాలు మనసుకు సంబంధించినవి. అందుచేత మనసు మన అదుపులోవుంటే అరిషడ్వర్గాలు

మన అదుపులో ఉన్నట్టే! మరి మనసును అదుపులో ఉంచగలిగే సాధన "శ్వాస మీద ధ్యాస" ధ్యానం ఒక్కటే.

అందుచేత "శ్వాస మీద ధ్యాస" ధ్యానమే సరియైన సాధన.

ఈ అరిషడ్వర్గాలు మన అదుపులో లేకపోతే వచ్చే నష్టాలు తెలుసుకుందాం.

**1. కామం:-** చూడండి "కామం" అంటే కోరికలు మంచివి కాదు అని తెలిసినా ఆచరణలో పెట్టుకోలేకపోతున్నాము. కారణం మనసు మన అదుపులో లేకపోవడమే!

**2. క్రోధం:-** అలాగే "క్రోధము" అంటే కోపం కూడా అదుపులో ఉండాలి. ఎందుచేతనంటే " తన కోపమే తన శత్రువు" అని పెద్దలు అన్నారు. అటువంటి కోపం అదుపులో లేదంటే మనసు అదుపులో లేకపోవడమే!

**3. లోభము:-** అంటే పిసినారితనం. అంటే ఎవ్వరికీ ఏదీ ఇవ్వకపోవడం.

కాని ఉన్నదాంట్లో ఇచ్చినవాడే గొప్పవాడు. వాడే లాభం పొందుతాడు. మరి అలా ఇవ్వలేకపోవడానికి కారణం మనసు అదుపులో లేకపోవడమే!

**4. మోహము:-** అంటే మితిమీరిన మమకారం. ఈ మమకారం పిల్లలు, భార్య, భర్త కాకుండా ధనం మీద కూడా వుంటుంది. ఒక్కొక్కసారి ఈ మామకారం వల్ల అంతులేని దుఃఖం కలుగు తుంది. ఇదికూడా మనస్సు అదుపులో లేకపోవడమే!

**5. మదము:-** మదము అంటే గర్వం. ఈ మదం 3రకాలు ధన మదము,

విద్యా మదము, రూప మధము. కానీ ఇవి మితిమీరి ఉండటం కూడా తప్పే.

ఇది కూడా మనస్సు అదుపులో లేకపోవడమే!

**6. మాత్సర్యము:–** అంటే అసూయ. దీనివల్ల ఇతరులకు నష్టం కలిగిస్తారు, తాము నష్టపోతారు. ఇది కూడా మనస్సు అదుపులో లేకపోవడమే! అందుచేత "శ్వాస మీద ధ్యాస" ధ్యానం చేసి మనస్సును అదుపులో ఉంచుకోగలిగితే ఈ అరిషడ్వర్గాలే లాభం కలిగిస్తాయి. అందుచేత "శ్వాస మీద ధ్యాస" ధ్యానమే సరియైన సాధన.

**3) ఏ సాధన వల్ల "ప్రజ్ఞానం బ్రహ్మ " అనే స్థితిలో నీవు నిలిచిపోతావో అదే మంచి సాధన.**

ఇది కొంచెం అర్థం చేసుకోవాలి. జ్ఞానం అన్నది బుద్ధితో ఉంటుంది. అందుకే గురువులు బుద్ధి వికసింప చేసుకో! అంటారు.

ఈ ఆధ్యాత్మిక జీవితంలో బుద్ధిని బాగా పదును పెట్టాలి. దానికోసమే సాధన. ఈ సాధన వల్ల బుద్ధి షార్ప్ గా తయారయ్యి ప్రతి విషయాన్ని తెలుసుకుంటారు.

అంటే నువ్వు చదివింది, విన్నది చెప్పగలగడం నీ బుద్ధి యొక్క చతురత. కానీ పత్రి గారు, బుద్ధుడు, శంకరాచార్యులవారు ఎన్నో సత్ గ్రంథాలు అందించారు. అది వారి ప్రజ్ఞ. ఆ జ్ఞానంవారి ఆత్మ నుండి పైకొస్తుంది.

వ్యాసుడు సాధనలో కూర్చున్నాడు. అప్పుడు ఆయన ఆత్మలో ఉన్న ప్రజ్ఞంతా బయటికి వచ్చింది. ఈ ప్రజ్ఞానాన్నే బ్రహ్మ అన్నారు.

అందుకే గురువులు ' ప్రజ్ఞానం బ్రహ్మ ' అనే స్థితిలో నిలిచిపో అన్నారు. అంటే నీ సాధన నిన్ను ఎంతవరకు తీసుకుని వెళ్లాలి? అంటే నీ అంతరాంతరాలలో నుంచి ఆ ప్రజ్ఞ వెలపలకి వచ్చేవరకు చేసే సాధనే అసలైన సాధన. ఆలా ప్రజ్ఞానం బ్రహ్మ అనే స్థితిలో నీవు నిలిచిపోవాలి.

నీలో నుంచి అంతర్ ప్రజ్ఞ బయటికి రావాలి. మరి ఈరోజువరకు రాఘవరావు గారు 45 పుస్తకాలు వ్రాశారు అంటే అది ఆయన అంతర్ ప్రజ్ఞ. ఎంత బయటకు వస్తుందో చూడండి. మనకి కూడా ఆ స్థితి రావాలి.

అందుకే  మహాత్ములు ఏమన్నారంటే? నీ అంతర్ ప్రజ్ఞని బయటికి తీసే వరకు నీ సాధన ఉండాలి అన్నారు. అప్పుడు ప్రజ్ఞానం బ్రహ్మ అనే స్థితిలో నీవు ఉంటావు.

ఎప్పుడైతే ఆత్మే పరబ్రహ్మం అని తెలుసుకున్నావో, ఆత్మ నుంచి వచ్చేదంతా కూడా ప్రజ్ఞే.

భగవద్గీత కృష్ణుడేమైనా  చదివి చెప్పాడా? ఆయన 700 శ్లోకాలుగా మనకు అందించడం జరిగింది.

అందుకే ఉత్తమమైన మంచి సాధన ఏది అంటే ఆ స్థితి నీకు వస్తే అదే మంచి సాధన. ఆలా మనసుని ప్రశాంతంగా ఉంచుకోవడం, అరిషడ్ వర్గాలని మన అధీనంలో ఉంచుకోవడం, ప్రజ్ఞానం బ్రహ్మ అనే స్థితిలో మనం నిలిచిపోవడం. ఈ మూడు ఏ సాధన తో నువ్వు సాధిస్తావో అదే ఉత్తమమైన మంచి సాధన. అదే బుద్ధుడు బోధించిన "ఆనాపానసతి" ధ్యానం. దానినే పత్రిగారు "శ్వాస మీద ధ్యాస" అన్నారు.

# ఆనంద స్థితిలో ఉండాలంటే?

నిత్యము ఆనంద స్థితిలో ఉండాలి అంటే 'సత్యాన్ని' పట్టుకోవాలి, సత్యాన్ని తెలుసుకోవాలి. సత్యము అంటే ఆత్మ. గురువు ద్వారా ఏం తెలుసుకున్నాము? మనం ఆత్మలమని, అంటే మనమే దైవాలమని. మరి మనమే దైవం అయినప్పుడు ఆనంద స్వరూపులమే కదా?

మరి ఆనంద స్వరూపులమైన మనం ఈ భూమ్మీద జన్మ తీసుకుని దుఃఖంలో ఎందుకుంటున్నాం? అంటే ఆనందం ఎలా పొందాలో తెలియక దుఃఖంలోనే ఉండిపోతున్నాం. మరి ఆనందం ఎలా పొందాలి? అన్నది గురువు ద్వారా నేర్చుకున్నాము.

నువ్వెవరో తెలుసుకుంటే అదే నీకు శాశ్వతమైన ఆనందస్థితి. అయితే అటువంటి ఆనందం పొందడానికి మనం ఈ మానవ జన్మలోకి వచ్చాం.

ఈ మానవ జన్మలో కొన్ని జన్మలు తమో గుణంతో, కొన్ని జన్మలు రజోగుణంతో జీవిస్తూ అజ్ఞానంతో ఉంటూ జ్ఞానాన్ని పొందలేక, మనకి తెలిసినదే కరెక్ట్ అనుకుంటు, నాకు ఎవ్వరూ చెప్పక్కర్లేదు అని మూర్ఖత్వంతో కొన్ని జన్మలు, నాకు తెలుసు అని అజ్ఞానంతో కొన్ని జన్మలు తీసుకుని మెల్లిగా 350 జన్మలు తీసుకున్నాక, సాత్విక స్థితిలోకి వస్తాం.

అప్పుడు గురువు వచ్చి మరి ఈ దుఃఖానికి కారణం, ఈ బాధలకి కారణం అజ్ఞానమే అని చెప్తూ, ఈ అజ్ఞానాన్ని తొలగించే మార్గం జ్ఞానం పొందడమే అని చెప్పడం జరుగుతుంది. అయితే ఆ జ్ఞానం పొందాలి అంటే మనసు యొక్క ప్రభావం తగ్గాలి, ఆత్మ యొక్క ప్రభావం పెరుగుతూ ఉండాలి.

ఎందుకంటే ప్రతి జీవిలోను ఆత్మ ఉంది అని తెలుసుకున్నాం. మరి ఆత్మ ఉన్నా, ఆత్మకి ప్రాముఖ్యం ఇవ్వకుండా మనసుకే ప్రాముఖ్యం ఇవ్వడం వల్లే ఇంత దుఃఖం ఏర్పడింది. అందుచేత మనసు ప్రాముఖ్యం తగ్గించాలి.

మనసుకి నేను అనే అహంకారం, నాది అనే మమకారం అనే రెండు లక్షణాలు ఉండడం వల్ల, దేవుళ్ళమైన మనం జీవుల్లా బ్రతుకుతున్నాం. ఆలా

మనో స్థితిలో ఉండి మనసుకున్న అవలక్షణాలన్నీ ప్రదర్శిస్తూ దుఃఖంలో వుంటున్నాం.

ఈ దుఃఖం నుంచి బయటపడాలంటే? ఆధ్యాత్మికంగా ఎదగాలి. ఆధ్యాత్మికంగా ఎదగడానికి తొలిమెట్టు సేవ అయితే, రెండో మెట్టు త్యాగం. ఈ రెండిటి వల్లే ఆధ్యాత్మిక జీవితంలో గొప్పగా ఎదుగుతాం. వేదం ఏం చెప్పిందంటే "త్యాగేన అమృతస్య" అంటే త్యాగం చేయడం వల్లే అమృత తత్వాన్ని పొందగలవు అని.

అయితే ఏం త్యాగం చేయాలి? మనం మనోస్థితిలో ఉన్నప్పుడు ఏమి అలవాటు చేసుకున్నామో అవన్నీ వదులుకుంటే పరమాత్మ స్వరూపులుగా వుండగలుగుతాము.

సృష్టిలో ఒక నియమం ఉంది ఒకటి చావకుండా ఇంకొకటి పుట్టదట. అంటే ఒకటి త్యాగం చేయకుండా ఇంకొకటి పొందలేమట. అందుకే మనం అమృత స్వరూపులం కావాలి అంటే మనో లక్షణాలు వదులుకుంటే ఆత్మ లక్షణాలు మనకి అలవాటు అవుతాయి.

అంటే మనసుయొక్క సత్వ, రజో, తమో గుణాలన్నీ వదలగలిగితే ఆత్మ లక్షణాలైన దైవ లక్షణాలు పొందగలుగుతాం. సహజ స్వరూపుల మవుతాం.

అందుచేత ఏ గుణాలను వదులుకుంటే ఏమి పొందుతామో తెలుసుకుందాం.

**1) కాఠిన్యం చావకుండా కరుణ పుట్టదు**

నువ్వు కాఠిన్యాన్ని వదిలితే కరుణ నీలో నుంచి బయటికి వస్తుంది. అందుకే కాటిన్యం వదలకుండా కరుణ పుట్టదు అన్నారు. నువ్వు కాఠిన్యంలో ఉంటే మనో స్థితిలో ఉంటావు. కానీ అది వదులుకుంటే భగవంతుడి లక్షణమైన ఆ కరుణ నీలో నుంచి పుడుతుంది.

**2) ద్వేషం చావకుండా ప్రేమ పుట్టదు.**

అందరిని ద్వేషిస్తూ ఉంటే మనలో ప్రేమ అనేది పుట్టదు. ద్వేషించే వాడికి అందరూ శత్రువులే, ప్రేమించే వాడికి అందరూ మిత్రులే. ఆ ప్రేమ

సహజ గుణం కావాలి. ద్వేషమంటే చూడండి ఎవరికైనా మనకి నచ్చని వాళ్ళకి ఏద్దైనా ఘోరం జరిగితే మంచి పని అయింది అంటాం.

నీలో ద్వేషం ఉంది కాబట్టే ఎదుటివారిని విమర్శిస్తున్నావు. కాని వాడి కర్మకి వాడు అనుభవిస్తున్నాడు. నువ్వు వాడిని విమర్శించాల్సిన అవసరం లేదు. అటువంటి ద్వేషం చావకుండా ప్రేమ పుట్టదు.

శత్రువైనా అపాయంలో ఉన్నప్పుడు వాడిని రక్షిస్తే వాడికి కూడా ప్రేమ పుడుతుంది.

ఆలా  ఒక మనిషి భగవంతుడు కావాలి అంటే ఎన్ని అవలక్షణాలు వదులుకోవాలో ఆలోచించండి.

**3) హింస చావకుండా అహింస పుట్టదు.**

ఎప్పుడైతే పత్రిగారు వచ్చారో ఈ పిరమిడ్స్ సొసైటీలో అందరూ కూడా శాఖాహారులుగా మారారు. అంటే ఆయన ఎంతోమందిచేత హింస  ఆపించారు. మనం ఎప్పుడైతే జీవుల యెడల ప్రేమ చూపించామో, కరుణ చూపించామో అప్పుడు మనం హింసను మానేసినట్టే.

అందుకే ఫస్ట్ మనం హింస మానాలి అప్పుడు మనలోంచి అహింస అనే మంచి లక్షణం బయటకు వస్తుంది.

**4) అహంకారం చావకుండా వినయం పుట్టదు.**

అహం:- నేను ఫలానా, నేను గొప్ప, నాకు డిగ్రీలు ఉన్నాయి, నేను చాలా గొప్పవాడిని అని నువ్వు అనుకుంటే నీలో అహం ఉన్నట్టే!

అలాగే ధనం పెరిగినా అహంకారం పెంచుకోకూడదు. ఎప్పుడైతే అహం పెరిగిందో  ఆత్మజ్ఞానం అబ్బదు.

నేను చేస్తున్నాను అనుకుంటే అహంకారం, ఆత్మ చేయిస్తుంది అనుకుంటే వినయం. అందుకే నీలో అహంకారం పోయినప్పుడు  వినయం ఉత్పన్నమవుతుంది అని చెప్పడం జరిగింది. నువ్వు ఎప్పుడైతే వినయంగా జీవించగలుగుతావో నువ్వు దైవస్వరూపూడివే.

**5) అజ్ఞానం నశించనిదే జ్ఞానం రాదు.**

నేను శరీరం అనుకుంటే నువ్వు అజ్ఞానంతో ఉన్నట్టే. నేను ఆత్మని అని అనుకోవడమే కాదు, నేను ఆత్మ అన్నట్టుగా జీవించగలుగుతూ ఉంటే నువ్వు జ్ఞానవంతుడు అవుతున్నట్టే.

ఆత్మశక్తి పెంచుకోవడానికి, ఆత్మగా జీవించడానికి, ఆత్మానుభూతి పొందడానికి ధ్యానం చేయవలసిందే!.

నువ్వు శరీరము, మనసుని పట్టుకుంటే అజ్ఞానంలో ఉన్నట్టే! కాని ఆత్మను పట్టుకుంటే జ్ఞానం పెరుగుతుంది. మెల్లిగా అజ్ఞానం పోతుంది. అందుకే అజ్ఞానం వీడితేనే జ్ఞానం పెరుగుతుంది అన్నారు.

**6) శత్రుత్వం వదిలితేనే మిత్రత్వం వస్తుంది.**

అందర్నీ శత్రువుల్లా చూడకూడదు, మిత్రుడిగా చూడాలి. వాడిలో శత్రుత్వం చూస్తే నీకు మితృత్వమే దొరకదు.

చూడండి మహా భారత యుద్ధానికి ముందు శ్రీకృష్ణుడు రాయబారానికి వచ్చాడు. యుద్ధం వస్తే జరిగే వినాశనాన్నంతా చెప్పాడు. కానీ దుర్యోధనుడు కృష్ణుడి మాటలను లెక్కచేయలేదు, యుద్ధానికే సిద్ధమయ్యాడు. కృష్ణుని శత్రువుగా భావించాడు, నాశనమయ్యాడు.

అందుకే శత్రుత్వం వినాశనానికి దారైతే. మిత్రత్వం ఎదగడానికి దారి అంటారు. అందుకే పాండవులు కృష్ణుని మిత్రుడిగా స్వీకరించారు విజయం సాధించారు.

అందుకే ఎవ్వరి ఎడల శత్రుత్వం మనకి ఉండకూడదు. శత్రుత్వం వదిలేస్తే అందరూ మిత్రులుగానే కనిపిస్తారు.

**7) స్వార్థం వదిలితే కానీ త్యాగం ఉదయించదు.**

చూడండి నా వాళ్ళు అనుకుంటూ అందుకోసమే కష్టపడితే స్వార్థ బుద్ధి. అందరూ బాగుండాలి, విశ్వమంతా బాగుండాలి అనుకుంటూ కృషిచేస్తే అది త్యాగబుద్ధి అవుతుంది.

అందుకే పరుల కోసం కొంతైనా సేవ చేస్తే అది త్యాగబుద్ధి అవుతుంది. నువ్వు స్వార్థంతో కష్టపడితే నీకు ఎవరు బంధువులు కాకపోవచ్చు. కానీ

త్యాగబుద్ధితో నువ్వు కష్టపడినప్పుడు ప్రపంచమంతా నీకు బంధువులు గానే కనిపిస్తారు.

పత్రిగారు చెప్పారు “ పంచితేనే పెంచబడుతుంది” అని.


త్యాగం వలన ఎంత లాభం పొందుతామో తెలియపరిచారు. మరి ఆయన చెప్పినట్టు  మనం మంచి గుణాలను అలవాటు చేసుకోవాలి.

అందుకే “త్యాగేన అమృతస్య” అన్నారు. అంటే నీకు త్యాగ గుణం వుంటేనే అమృత స్వరూపుడు కాగలవు అని అర్థం. ఈ చెడ్డ గుణాలన్నీ మనసువి. మనసుకున్న ఈ గుణాలు నశిస్తేనే నువ్వు ఆనంద స్వరూపుడిగా ఉంటావు.

ఒక జ్ఞానిగా ఎదగాలంటే మనలోని కాఠిన్యం అనుకోండి, ద్వేషం, శత్రుత్వం, హింస, అజ్ఞానం ఇవన్నీ పోవాలి. అంటే  మనసుకున్న మలినాలు పోవాలి. దానికి ఒకే ఒక్క మార్గం అదే “శ్వాస మీద ధ్యాస”  ధ్యానం.

ధ్యాన సాధన ఎంత తీవ్రంగా చేస్తామో, అంత బాగా మనసుకున్న మలినాలను తొలగించుకుంటాం. మనసుని శుద్ధత్వంలో ఉంచుకోగలుగుతాం. మరి ఆత్మకు ఉన్న సద్గుణాలన్నిటిని అలవర్చుకుంటూ,  ఆత్మగా జీవిస్తూ, ఆనంద స్వరూపుడుగా ఉంటాం.

మరి ఈరోజు మనం వదులుకోవాల్సినవి తెలుసుకున్నాం ఏది అలవాటు చేసుకోవాలో తెలుసుకున్నాం. అందుచేత ధ్యానం చేద్దాం అందరి చేత చేయిద్దాం.



బ్రహ్మర్షి పత్రీజీ ఆశీస్సులతో...
తటవర్తి వీరరాఘవరావు, శ్రీమతి రాజ్యలక్ష్మి దంపతులచే


## ఆత్మజ్ఞాన శిక్షణా శిబిరం

భీమవరంలో ప్రతీ నెలా 1, 2, 3 తేదీలలో పూర్తి రెసిడెన్షియల్ పద్ధతిన ఆత్మజ్ఞాన శిక్షణా శిబిరం నిర్వహించబడుతుంది. ఎన్ని రోజులు ధ్యానం చేసినా ధ్యానంలో పురోగతి సాధించలేనివారు, ఆలోచనలతో ఇబ్బంది పడేవారు ఈ శిబిరంలో పాల్గొంటే ఒకే సిట్టింగులో మూడు లేక నాలుగు గంటలు ధ్యానం చేయగల స్థితికి చేరుకుంటారు. పరిమిత సభ్యులకు మాత్రమే అవకాశం ఉన్నందున ముందుగా మీ పేర్లు నమోదు చేసుకోండి.

నిర్వహించు ప్రదేశం: శ్రీ వెంకటేశ్వరస్వామి వారి మందిరం, నరసింహపురం, ఉండి రోడ్, భీమవరం.

ప్రవేశం : మూడు రోజులకు భోజనం, వసతి ఉచితం


వివరాలకు : **తటవర్తి వీరరాఘవరావు,**
తటవర్తి వారి వీధి, భీమవరం - 534 201.
సెల్ : 94403 09812, 94901 71853

## పత్రీ గారి పుస్తకములు

1) జ్ఞానరసగుళికలు (పత్రీజీ) - రూ.160/-
2) పరమగురువుల ప్రబోధాలు (పత్రీజీ) - రూ.160/-
3) యోగుల సందేశాలు - రూ.160/-
4) జ్ఞాన సందేశాలు - రూ.160/-
5) పత్రీజీ సందేశాలు - రూ.160/-
6) విజ్ఞానసారం - రూ.160/-
7) ధ్యానం (పత్రీజీ) - రూ.60/-

బ్రహ్మర్షి పితామహ పత్రీజీ ఆశీస్సులతో..



**బ్రహ్మర్షి తటవర్తి రాఘవరావు** మరియు **బ్రహ్మవిద్వరిష్ఠ తటవర్తి రాజ్యలక్ష్మి గార్లు** అందిస్తున్న

# ఆత్మజ్ఞాన సందేశాలు

క్రింద ఇవ్వబడిన ప్రసార మాధ్యమాల ద్వారా వినవచ్చును మరియు చదవవచ్చును

## 1. Zoom మరియు YouTube :-

**a)** ప్రతిరోజూ ఉదయం **Zoom** లో **4 to 6.30 a.m. Silence Meditation** మరియు 6.30 to 7.30 a.m. వరకు **తటవర్తి దంపతుల ఆత్మజ్ఞాన సందేశాలు**

**Zoom I.D. :2413823868, Password : RAO**

**b)** పై కార్యక్రమము **6.30 to 7.30 a.m.** వరకు **Youtube**లో కూడా **Live** ఇవ్వబడుతుంది.

**c)** ఎవరైతే **TVR & TRL Whatsapp** గ్రూపులో వుంటారో వారికి **Zoom Link & You Tube Links** మరియు తటవర్తి దంపతుల క్లాసుల వివరాలు పంపడం జరుగుతుంది. వారు **సింధూర: 8555995217** నెంబరు తప్పనిసరిగా **save** చేసుకోవాలి.

**d)** తటవర్తి వారి వాట్సాప్ గ్రూపులో జాయిన్ కావాలనుకునేవారు వీరిని సంప్రదించండి. సింధూర: 85559 95217, మధు: 78939 17364 లేకపోతే **www.tst.org.in Open** చేసిన తర్వాత **Join in Whatsapp group** లింక్ మీద నొక్కండి.

## 2.YouTube Channel లో ప్రసారమయ్యే కార్యక్రమములు :-

**a) Channel Name : Tatavarthy Veera Raghava Rao.** ఇందులో 2000 పైగా వీడియోలలో తటవర్తి దంపతుల సందేశాలు ఇవ్వడం జరిగింది.

**b)** అలాగే **PMC** వారు కూడా బ్రహ్మర్షి తటవర్తి వీరరాఘవరావు గారి యొక్క **YouTube Channel** ప్రారంభించారు. **Channel Name : Brahmarshi Tatavarthy Veera Raghavarao**

**c)** తటవర్తి దంపతుల దగ్గర ట్రైనింగ్ అయిన మాస్టర్ల సందేశాల కొరకు **Tatavarty Spiritual Trainees** ఛానెల్‌లో చూడండి.

**d) Direct** గా **YouTube app** లోకి వెళ్ళి **search bar** లో **Tatavarthy Veera Raghava Rao** అని టైపు చేస్తే తటవర్తి దంపతుల అన్ని వీడియోలు చూడవచ్చు.

## 3. YouTube ఛానెల్‌ని subscribe చేసుకోవాలంటే :-

**a) Whatsapp group** లో మీకు పంపబడుతున్న **Youtube** లింక్ మీద నొక్కినప్పుడు **Tatavarthy Veera Raghava Rao** ఛానెల్ **open** అవుతుంది. **Open** అవ్వగానే **subcribe** కనిపిస్తుంది. దాని మీద నొక్కితే **subscribe** అవుతారు. ప్రక్కనే వున్న **bell button** నొక్కితే ప్రతీ రోజు వచ్చే వీడియోలు చూడవచ్చు.

లేకపోతే www.tst.org.in/videos/ ఓపెన్ అయిన తరువాత I లో Tatavarthy Veera Raghava Rao పేరు మీద నొక్కండి. II & III లో వున్న పేరు మీద నొక్కండి. ఛానెల్స్ Open అవుతాయి. Open అవ్వగానే subcribe కనిపిస్తుంది. దాని మీద నొక్కితే subscribe అవుతారు. ప్రక్కనే వున్న bell button నొక్కితే ప్రతీ రోజు వచ్చే వీడియోలు చూడవచ్చు.

**4. తటవర్తి దంపతుల Website ద్వారా పొందే సమాచారము :-**

**website address : www.tst.org.in**

a) తటవర్తి దంపతుల ఆధ్వర్యంలో జరిగే కార్యక్రమాల వివరములు మరియు Google Maps Location తెలుసుకోవచ్చు.

b) తటవర్తి దంపతుల మొత్తం పుస్తకాలు PDF రూపంలో కలవు. వాటిని ఉచితంగా Download చేసుకోవచ్చు. ఈ పుస్తకాలు తెలుగు, కన్నడ, హిందీ మరియు ఇంగ్లీషు భాషలలో వున్నాయి.

c) తటవర్తి దంపతుల సందేశాలు Concept వారీగా YouTube Play lists రూపంలో ఇవ్వడం జరిగింది.

d) తటవర్తి దంపతుల సందేశాల సారాంశము కొటేషన్స్ రూపంలో ఇవ్వడం జరిగింది.

e) తటవర్తి దంపతుల ఫోటోలు కూడా చూడవచ్చు.

5. భీమవరంలో ప్రతి నెలా 1, 2, 3 తేదీలలో జరిగే ఉచిత ఆత్మజ్ఞాన శిక్షణా తరగతుల రిజిస్ట్రేషన్ కొరకు సంప్రదించవలసిన నెంబరు : **సింధూర, 8555995217**

**6. ఆత్మజ్ఞాన పుస్తకాలు :**

**పత్రీజీ వ్రాసిన సుమారు 50 పుస్తకాలను 7 పుస్తకములలో కూర్చబడినవి. సెట్ వెల – రూ.1,000/-లు**

**తటవర్తి రాఘవరావు గారి 40 పుస్తకాల సెట్ వెల – రూ.2,000/-లు**

**YouTube Play lists**

**1) యోగవాశిష్టం – ఆత్మజ్ఞాని ప్రవర్తన ఎలా వుంటుంది?, (2) చివటం అమ్మవారి సందేశాలు-2 వీడియోలు, (3) ముమ్మిడివరం బాలయోగి సందేశాలు-12 వీడియోలు, (4) మాతా మాణిక్యేశ్వరి సందేశాలు-9 వీడియోలు, (5) షిరిడీ సాయి సందేశాలు-112 వీడియోలు, (6) పత్రీజీ జ్ఞాన సందేశాలు-37 వీడియోలు, (7) కోరికల వల్ల నష్టాలు-19 వీడియోలు, (8) దుఃఖం వల్ల లాభాలు-2 వీడియోలు, (9)విగ్రహారాధన-120 వీడియోలు, (10) మంత్రపుష్పం-23 వీడియోలు, (11) వికృతి – ప్రకృతి-సంస్కృతి-100 వీడియోలు, (12) గురువు యొక్క సహాయం-13 వీడియోలు, (13) భార్యాభర్తలు గొడవపడకూడదంటే? (14) మాస్టర్ ట్రైనింగ్ క్లాస్, (15) ధ్యానం-35 వీడియోలు, (16) స్త్రీ జన్మల్లో నేర్చుకొనేవి – పురుష జన్మల్లో నేర్చుకొనేవి, (17) దేవుడికి దయ లేదా దేవుడి దయ కలగాలంటే?-11 వీడియోలు, (18) ఉపమాన ధ్యాన సందేశాలు, (19) ఆరోగ్య సమస్యలు.**

పై పుస్తకముల కొరకు ఈ క్రింది నెంబర్లను సంప్రదించండి

**తటవర్తి వీరరాఘవరావు గారు : 9440309812**

**మధు : 7893917364**

# తటవర్తి వీరరాఘవరావు గారి రచనలు

1) జీవితశాస్త్రం (మొదటి భాగం) - రూ.130/-
2) జీవితశాస్త్రం (రెండవ భాగం) - రూ.130/-
3) జీవిత సత్యాలు - రూ.130/-
4) భగవంతుడంటే - రూ.130/-
5) సత్యమార్గం - రూ.160/-
6) ఆత్మ శాస్త్రం - రూ.130/-
7) ధ్యాన శాస్త్రం - రూ.130/-
8) భగవద్గీతా సారం - శ్రీ కృష్ణ సందేశం-రూ.160/-
9) ధ్యాన శక్తి - రూ.130/-
10) తెలుసుకోండి - రూ.130/-
11) జీవిత సూక్ష్మాలు - రూ.130/-
12) మరణించకముందే మరణించాలి - రూ.130/-
13) మరోజన్మ (తటవర్తి రాజ్యలక్ష్మి) - రూ.160/-
14) "గైడింగ్" ధ్యానం ఎందుకు కాదు? - రూ.120/-
15) గీతాసందేశం - రూ.120/-
16) మెహర్‌బాబా సందేశాలు - రూ.100/-
17) కర్మ సిద్ధాంతం - రూ.80/-
18) ధ్యానమంటే ? - రూ.80/-
19) త్రివిధాలు - రూ.80/-
20) శాస్త్రాల అర్థం- అంతరార్థం - రూ.70/-
21) ఆత్మజ్ఞానం ఎందుకు? - రూ.70/-
22) జ్ఞాన జ్యోతి - రూ.70/-
23) జ్ఞాన కుసుమాలు - రూ.70/-
24) మరణం తర్వాత కూడా వచ్చేవి - రూ.70/-
25) జ్ఞానమాల (తటవర్తి రాజ్యలక్ష్మి) - రూ.70/-
26) దుఃఖ నివారణామార్గం - రూ.60/-
27) బ్రహ్మజ్ఞానం - రూ.60/-
28) ధ్యానం (పత్రీజీ) - రూ.60/-
29) ధ్యానం వల్లనే జ్ఞానం - రూ.60/-
30) అతీంద్రియ శక్తులు - రూ.60/-
31) విద్యార్థుల వికాసానికి ధ్యాన విద్య - రూ.60/-
32) భూతదయే దైవత్వం - రూ.60/-
33) ఆలోచించండి - రూ.60/-
34) షిరిడీ సాయి సందేశాలు - రూ.60/-
35) నిర్వాణ మార్గం - రూ.60/-
36) సంకల్పమంటే? - రూ.50/-
37) ఈ జీవితం ఎందుకు? - రూ.50/-
38) ఆశ్చర్యం... ఆశ్చర్యం - రూ.50/-
39) ఆర్థిక పరిస్థితి పెంచుకోవాలంటే- రూ.50/-
40) సత్యం - రూ.40/-
41) చక్రాలు - రూ.40/-
42) గురువును గుర్తించడం ఎలా? - రూ.40/-
43) భాగవత సన్నివేశాల అంతరార్థం- రూ.40/-
44) మౌన ధ్యానం - రూ.40/-
45) మనం ఇహలోకవాసులమా? పరలోకవాసులమా? - రూ.20/-
46) శాకాహారమే మానవాహారం - రూ.15/-
47) అహింస మరియు శాఖాహారం- రూ.15/-

పుస్తకముల కొరకు :

**తటవర్తి వీర రాఘవరావు,**
తటవర్తివారి వీధి, భీమవరం-1. ప॥గో॥జిల్లా. ఆం.ప్ర.
సెల్: 9440309812, 9490171853



వశిష్టుల వారు నాలుగు విషయాలు చెప్పారు.

1. వివేకం లేని వాడికి శాస్త్రం బరువు

2. వైరాగ్యం లేని వాడికి జ్ఞానం బరువు.

3. శాంతి లేని వాడికి మనసు బరువు.

4. ఆత్మజ్ఞానం లేని వాడికి శరీరం బరువు.

అజ్ఞానులు యోగంలో ఉంచవలసిన శరీరాన్ని భోగంలో వుంచి శరీరం రోగాలలో కూరుకుపోయేటట్టు చేయడం వల్ల ఈ శరీరం బరువుగా అనిపిస్తుంది. కానీ జ్ఞాని ఏ కష్టం వచ్చినా కర్మ పోతుంది, నా బాకీ తీరిపోతుంది అనుకుంటూ సంతోషంగా కర్మను అనుభవిస్తాడు. అందుకే అజ్ఞానికి ఈ జ్ఞానం లేక ఈ శరీరం బరువు అనుకుంటాడు.

**శ్రీమతి తటవర్తి రాజ్యలక్ష్మి**

రూ.70/-